www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

విలేకరులు కావలెను

18సం॥ లుగా వెలుపడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల, మండలాల వారీగా విలేకరులు కావలెను..

★ ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించవలసిన నంబర్ ★

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 221 | మంగళవారం 13.10.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

## జనసంద్రమైన

# ఢిల్లీ రోడ్లు..

బారాఖంబా నుంచి సుప్రీంకోర్టుకు విపక్ష నాయకుల పాదయాత్ర

ఓట్ చోర్.. గద్దీ ఛోడ్.. నినాదాలతో మారుమోగి...

### చేయి చేయి కలిపిన విపక్ష నేతలు.. సుప్రీంకోర్టు దిశగా పాదయాత్ర





### ఢిల్లీని జైలుగా మార్చేశారు..

- ఓట్ చోరీపై ప్రజా ఉద్యమం.. పోరాటం ఆగదన్న రాహుల్
- మోదీ, అమిత్ షా జవాబు చెప్పాలి.. రాహుల్ గాంధీ
- ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన జరిగే వరకు పోరాటం కొనసాగిస్తాం
- ఢిల్లీలో భారీ పోలీసు మోహరింపు.. కేంద్రంపై రాహుల్ విమర్శలు
- రాజ్యాంగ పరిరక్షణ కోసమే మా పోరాటం: రాహుల్ గాంధీ

ఢిల్లీ రోడ్లు జనసంద్రంలా మారాయి. ఓట్ చోర్.. గద్దీ ఛోడ్..జ్ఞానేష్ కుమార్ రాజీనామా నినాదాలతో మారుమోగి పోతున్నాయి. కన్నాట్ నుంచి సుప్రీం కోర్టు దిశగా వెళ్తున్న డెమొక్రసీ మార్చ్ లో ఇండియా కూటమి నేతలు చేయి చేయి కలపడంతో ఊహించని విధంగా సాగుతోంది. 2026 అక్టోబర్ 12న డెమొక్రసీ మార్చ్ పేరున ఇండియా కూటమి ఛలో సుప్రీం కోర్టు ర్యాలీని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ముందుండి నడిపిస్తున్నారు. అడుగడుగునా శ్రేణులకు సలహాలు ఇస్తూ.. ముందుండి మార్చ్ ను విజయవంగంగా నడిపిస్తున్నారు. రాహుల్, ప్రియాంకతో కలిసి నేహాబొరా మార్చ్ లో పాల్గొన్నారు. మండి హౌస్, బరాఖంబా రోడ్ సమీపంలో ఇసకేస్తే రాలనంత జనంతో మార్చ్ ముందుకు సాగింది. కూటమి ర్యాలీలో తృణమూల్ కాంగ్రెస్, ఆర్జేడీ, సమాజ్ వాదీ పార్టీ, వామపక్ష పార్టీలు పాల్గొన్నాయి. ముఖ్య నేతలతో పాటు పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ర్యాలీ పార్గొన్నారు. భగవన్ దాస్ రోడ్డు దగ్గర నిరసనలో జాయిన్ అయ్యారు. అదేవిధంగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు రేవంత్, డీకే శివకుమార్, సుఖ్వీందర్ సింగ్,వీడీ సతీషన్, మంత్రులు పాల్గొన్నారు.

వివరాలు 3 పేజీలో

### ఢిల్లీ ఎందుకు నిర్బంధంలో ఉంది.. శాంతియుత నిరసనను ఎందుకు అడ్డుకుంటున్నారు?

## దేశంలో రెండో ఆజాదీ ఉద్యమం..

### జ్ఞానేశ్ కుమార్‌కు తొలగింపుల టాస్క్ ఇచ్చారు

- సీఈసీని తొలగించేందుకు మోదీకి అభ్యంతరమేంటి? సీఎం ప్రశ్న
- పేదలు, యువత ఓట్లే లక్ష్యంగా ఎస్ఐఆర్
- ఎన్నికల వ్యవస్థపై కాంగ్రెస్ పోరు.. రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- ఓటు హక్కును కాపాడుకోవాల్సిన సమయం వచ్చింది
- ఈడీ, సీబీఐ తర్వాత ఎన్నికల కమిషన్‌పై కన్ను









## దొరికిందల్లా దోచుకుంటున్నారు..

### రేడియల్ రోడ్-2 టెండర్లలో రూ.600 కోట్ల అవినీతి

- రేవంత్ శాఖలోనే దోపిడీ జరుగుతోందన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే
- సీఎంవో నుంచి టెండర్లు వేయొద్దని ఫోన్లు వచ్చాయి
- టెండర్ల అక్రమాలపై న్యాయపోరాటం చేస్తానన్న రాజగోపాల్‌రెడ్డి
- టెండర్ల ఆరోపణలతో కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు బహిర్గతం
- రేడియల్ రోడ్ టెండర్లపై రాహుల్‌కు ఫిర్యాదు చేస్తా

02

సీఎంవో నుంచి టెండర్లు వేయొద్దని ఫోన్లు వచ్చాయి



సింగరేణి మూతపడే పరిస్థితులు వచ్చాయన్న రాజగోపాల్‌రెడ్డి

## సుప్రీంకోర్టు తలుపులు తెరిచే ఉంటాయి..

### సీజేఐని కలిసేందుకు రాహుల్, ఖర్గే లేఖ

**సుప్రీంకోర్టును రాజకీయ వివాదాల్లోకి లాగొద్దు: సీజేఐ జస్టిస్ సూర్యకాంత్..**





- నిర్దిష్ట కారణాలతోనే భేటీకి నిరాకరణ
- సుప్రీంకోర్టు తలుపులు అందరికీ తెరిచే ఉంటాయి
- పౌరులైనా, ప్రజాప్రతినిధులైనా కోర్టును ఆశ్రయించవచ్చు
- వన్ నేషన్ వన్ ఎలక్షన్ పర్యటన రద్దు
- ప్రయోజనాల ఘర్షణతోనే పర్యటన నివారణ

02

### ఈసీ పై సుప్రీం ఆగ్రహం

ఎన్నికల సంఘం వాదనను తోసిపుచ్చిన అత్యున్నత న్యాయస్థానం
ఫారం-6 మార్పులపై రికార్డులు పరిశీలిస్తామన్న ధర్మాసనం
బిహార్ ఎస్ఐఆర్ తీర్పులో ఫారం-6 ప్రస్తావనే లేదు

## ఛార్జీలపై పునఃపరిశీలన

### కామన్ పాస్ ధరలపై త్వరలో స్పష్టత

- ప్రయాణికులపై అదనపు భారం ఉండకూడదు
- రోజువారీ పాస్ రూ.400.. నెలవారీది రూ.8,500
- ఆర్టీసీ-మెట్రో సేవల వినియోగం పెంచడమే లక్ష్యం
- అందుబాటు ధరల్లో కామన్ పాస్ అమలుకు కసరత్తు
- పొన్నం ప్రభాకర్ ప్రకటనతో ప్రయాణికుల్లో కొత్త ఆశలు

02



## కాంగ్రెస్ యాక్షన్ ప్లాన్ ఏంటి



- బీరు కంపెనీలకు నీళ్లు.. పంటలకు మాత్రం కొరత
- దేవాదుల మోటార్లు ఎందుకు నడపడం లేదని ప్రశ్న
- జూరాల గేట్లు తెరిస్తే రైతులకు జైలు శిక్షలా?
- సింగూరు నీళ్లపై కాంగ్రెస్ యాక్షన్ ప్లాన్ ఏంటి?

03

## ఉద్యోగంలో నుంచి తీసేశాడని కక్ష..



- కౌకూర్‌లో ఐదేళ్ల చిన్నారి కిడ్నాప్, హత్యతో కలకలం
- రూ.20 లక్షల కోసం చిన్నారిని కిడ్నాప్ చేసిన మాజీ గార్డు
- అభం శుభం తెలియని చిన్నారిని పొట్టనబెట్టుకున్న నిందితుడు
- బతుకమ్మ వేడుకల్లో అదృశ్యమైన చిన్నారి.. చివరకు విషాదాంతం

02

## ఫసల్ బీమా అమలు చేయాల్సిందే

### మంత్రి పొన్నం సవాల్‌కు నేను సిద్ధం: రామచందర్ రావు



- మోదీ పాలనలో అభివృద్ధి.. తెలంగాణకు భారీగా నిధులు
- రాహుల్ గాంధీని తెలంగాణకు రానివ్వం
- ఓటర్ల తొలగింపుపై నిరూపించండి.. పొన్నం ప్రభాకర్‌కు సవాల్
- ఆరు గ్యారంటీలు అమలు చేసేదాకా రాహుల్‌ను అడ్డుకుంటాం
- తెలంగాణలో డ్రగ్స్ పెరుగుతున్నాయి.. రాంచందర్ రావు విమర్శలు

03

## సరికొత్త సైబర్ మోసం

### 'YES', 'NO' రిప్లైలకు దూరంగా ఉండండి..

- ఓటీపీలు అడగరు.. లింకులు నొక్కక్కర్లేదు!
- వాట్సాప్ సందేశంతోనే క్షణాల్లో సొమ్ము స్వాహా!
- ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్‌తో కేటుగాళ్ల సరికొత్త పన్నాగం!
- నకిలీ బ్యాంకు మెసేజ్‌లతో సైబర్ కేటుగాళ్ల కొత్త ఎత్తుగడ
- సందేశం చూసి కంగారు పడొద్దు.. సైబర్ ఉచ్చులో చిక్కుకోవద్దు

02







## ఉమ్రా యాత్రలో విషాదం..

- ఉమ్రా యాత్రలో విషాదం.. హైదరాబాద్‌కు చెందిన ఐటీ ఉద్యోగి మృతి
- రియాద్ విమానాశ్రయంలో బాంబు దాడి.. హైదరాబాదీ మృతి
- పవిత్ర యాత్రలో తీరని విషాదం.. యూసుఫ్ కన్నుమూత
- తండ్రిని కోల్పోయిన ముగ్గురు చిన్నారులు.. భార్యకు గాయాలు

05

# ఛార్జీలపై పునఃపరిశీలన

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన ఆర్టీసీ – మెట్రో కామన్ పాస్ ఛార్జీలను పునఃపరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కామన్ పాస్ ఛార్జీలు అధికంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి వరుసగా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ప్రజల అభిప్రాయాలను, వాస్తవ పరిస్థితులను సమీక్షిస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం అమల్లోకి తీసుకొచ్చిన కామన్ పాస్ ధరలు రోజువారీ పాస్‌కు రూ.400 కాగా, ఇందులో మెట్రో వాటా రూ.300, ఆర్టీసీ వాటా రూ.100గా ఉంది. అదేవిధంగా నెలవారీ కామన్ పాస్ ధర రూ.8,500 కాగా.. ఇందులో మెట్రో వాటా రూ.7,000, ఆర్టీసీ వాటా రూ.1,500గా నిర్ణయించారు. అయితే ఈ ఛార్జీలు సామాన్య ప్రజలకు భారంగా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు ఛార్జీలను పునః పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించి, ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆర్టీసీ – మెట్రో కామన్ పాస్ ధరలను నిర్ణయించే అంశంపై త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు ఆర్టీసీ, మెట్రో సేవలను ప్రజలు విస్తృతంగా వినియోగించుకునేలా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ప్రయాణికులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరేలా, వారి అవసరాలకు అనుగుణంగా, సౌకర్యవంతమైన ధరలతో కామన్ పాస్ విధానం అమలయ్యేలా తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఆర్టీసీ – మెట్రో కామన్ పాస్ ద్వారా ప్రజా రవాణాను మరింత అభివృద్ధి చేసి, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజలపై అదనపు ఛార్జీల భారం మోపడం ప్రభుత్వ లక్ష్యం కాదని, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

# సుప్రీంకోర్టు తలుపులు తెరిచే ఉంటాయి..

**ఢిల్లీ :** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో భేటీ కాకపోవడానికి గల కారణాలను బహిర్గతం చేసేందుకు భారత ప్రధాన న్యాయమూర్తి సోమవారం నిరాకరించారు. వారిద్దరి నడుమ జరిగిన లేఖల వ్యవహారంలో గోప్యతను పాటించినట్లు సీజేఐ స్పష్టం చేశారు. "ఓటు చోరీ"కి స్వస్తి పలకాలనడం, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా, ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ నిలిపివేత మరియు తిరిగి పేపర్ బ్యాలెట్ విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఒక వినతిపత్రాన్ని సమర్పించేందుకు లోక్‌సభ, రాజ్యసభల ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలు సీజేఐని కలవడానికి సమయం కోరుతూ లేఖ రాశారు. ఈ భేటీని నిరాకరించడంపై అడిగిన ప్రశ్నలకు సీజేఐ సమాధానమిస్తూ.. ఆదివారం తనకు లేఖ అందిందని, ఆ రాత్రే దానికి బదులిచ్చానని తెలిపారు. కొన్ని నిర్దిష్ట కారణాల వల్లనే తాను కలవలేకపోతున్నానని ఆ లేఖలో పేర్కొన్నట్లు ఎన్‌హెచ్‌ఆర్‌సీ కార్యక్రమంలో మాట్లాడిన అనంతరం వెల్లడించారు. అయితే ఆ కారణాలను వివరించాలని కోరగా, "ఆ లేఖలోని అంశాల గురించి రాహుల్ గాంధీనే అడగాలని మనవి చేస్తున్నాను. నేను మాత్రం దాని గోప్యతను కాపాడాను" అని ఏఎన్ఐ వార్తా సంస్థతో వ్యాఖ్యానించారు. చట్టసభల ప్రతినిధులు, ఎంపీలు తమ ఆందోళనలను ఎలా ముందుకు తీసుకెళ్లాలని ప్రశ్నించగా.. సుప్రీంకోర్టు తలుపులు అందరికీ ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని సీజేఐ స్పష్టం చేశారు. సామాన్య పౌరుడైనా, ప్రజాప్రతినిధి అయినా ఎవరైనా పిటిషన్‌తో కోర్టును ఆశ్రయించవచ్చని, చట్టానికి లోబడి వారి సమస్యలను విచారించి తగిన న్యాయం అందిస్తామని తెలిపారు. మరోవైపు.. ఢిల్లీలోని ప్రస్తుత పరిస్థితులు, నిరసనలపై వ్యాఖ్యానించడానికి ఆయన నిరాకరిస్తూ, అది శాంతిభద్రతల అంశమని పేర్కొన్నారు. అలాగే జాయింట్ పార్లమెంటరీ కమిటీ 'వన్ నేషన్ వన్ ఎలక్షన్'
సుప్రీంకోర్టు పర్యటన రద్దు కావడంపై స్పందిస్తూ.. ఆ అంశంపై కోర్టులో పరస్పర ప్రయోజనాల ఘర్షణ ఏర్పడే అవకాశం ఉన్నందున, న్యాయమూర్తులంతా కలిసి పరిపాలనా పరంగా చర్చించి ఆ పర్యటనను నివారించాలని సమిష్టి నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

# సరికొత్త సైబర్ మోసం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సైబర్ నేరగాళ్లు సాంకేతికతను ఆసరాగా చేసుకుని సరికొత్త పన్నాగాలతో విరుచుకుపడుతున్నారు. ఎవరికీ ఎలాంటి ఓటీపీ చెప్పకుండా, ఏ అనుమానాస్పద లింక్‌పైనా క్లిక్ చేయకుండానే.. వాట్సాప్‌లో వచ్చిన సందేశానికి కేవలం 'NO' అని రిప్లై ఇచ్చినందుకే క్షణాల్లో బ్యాంకు ఖాతా ఖాళీ అయిపోతున్న ప్రమాదకర సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. ఇటీవల ఓ చార్టర్డ్ అకౌంటెంట్ సైతం ఈ సరికొత్త ఉచ్చులో చిక్కుకుని నిలువునా మునిగిపోవడంతో నగర సీపీ సజ్జనార్ ప్రజలను అప్రమత్తం చేస్తూ కీలక హెచ్చరికలు జారీ చేశారు. గుర్తు తెలియని నెంబర్ల నుంచి 'మీ ఖాతా నుంచి ఇంత మొత్తం డెబిట్ అయ్యింది. ఈ లావాదేవీ మీరు చేయకపోతే వెంటనే NO అని సమాధానం ఇవ్వండి' అంటూ తొలుత భయాందోళనకు గురిచేసేలా నకిలీ మెసేజ్‌లు పంపుతారని ఆయన వివరించారు. ఖాతాలో డబ్బులు పోయాయన్న కంగారులో ఎవరైనా 'NO' అని రిప్లై ఇచ్చిన వెంటనే, ఆ సందేశంలో కనిపించకుండా పొందుపరిచిన ప్రమాదకర మాల్‌వేర్ (స్క్రిప్ట్) (ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్) ఆటోమేటిక్‌గా యాక్టివేట్ అవుతాయి. క్షణాల్లో మొబైల్ ఫోన్‌పై పూర్తి నియంత్రణను హ్యాకర్లు చేజిక్కించుకుని ఖాతాల్లోని సొమ్మంతటినీ ఊడ్చేస్తున్నారని సజ్జనార్ తెలిపారు. అందుకే గుర్తుతెలియని నెంబర్ల నుంచి బ్యాంకు లావాదేవీల పేరుతో వచ్చే మెసేజ్‌లకు 'YES' గానీ, 'NO' గానీ ఎట్టిపరిస్థితుల్లోనూ రిప్లై ఇవ్వవద్దని, ఆ నెంబర్లను వెంటనే బ్లాక్ చేసి చాట్‌ను డిలీట్ చేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. లావాదేవీలను అధికారిక బ్యాంకింగ్ యాప్‌లలోనే పరిశీలించుకోవాలని, ఒకవేళ మోసపోయినట్లయితే వెంటనే 'గోల్డెన్ అవర్'లో '1930' సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని, అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

# హస్తినను ఎవరూ వదిలి వెళ్లొద్దు..

**ఢిల్లీ :** రాజధాని ఢిల్లీలో ఉన్న తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు సీఎం రేవంత్ రెడ్డి , పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ లక ఆదేశాలు జారీ చేశారు. తాము తిరిగి చెప్పేంత వరకు ఎవరూ ఢిల్లీ వదిలి హైదరాబాద్, సొంత ప్రాంతాలకు వెళ్లొద్దని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఢిల్లీ కేంద్రంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసనలు, ఉద్యమాలు జరుగుతున్న నేపథ్యంలో నాయకులంతా అక్కడే అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

**తెలంగాణ నేతలకు స్వల్ప గాయాలు..**

ఇవాళ ఢిల్లీలో నిర్వహించిన ఇండీ కూటమి భారీ ర్యాలీలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. నిరసనకారులను అడ్డుకునేందుకు పోలీసులు జరిపిన లాఠీఛార్జ్, చోటుచేసుకున్న తొక్కిసలాటలో పలువురు నాయకులు గాయపడ్డారు. ఈ ఘటనలో ర్యాలీలో పాల్గొన్న పలువురు తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు, ప్రజాప్రతినిధులకు స్వల్ప గాయాలయ్యాయి. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ నేతలపై పోలీసులు ప్రవర్తించిన తీరుపై కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

# ఈసీ పై సుప్రీం ఆగ్రహం

**ఢిల్లీ :** కేంద్ర ఎన్నికల కమిషన్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహంవ్యక్తం చేసింది. బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా కొత్తగా తీసుకొచ్చిన ఫారం–6 పై తాము ఎటువంటి తీర్పు ఇవ్వలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు సోమవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. బిహార్ ఎస్ఐఆర్‌పై తీర్పు వచ్చే సమయానికి ఫారం–6 లో మార్పులు చూపలేదన్న సీజేఐ.. దరఖాస్తులో మార్పులు ఎవరు చేశారో రికార్డులు పరిశీలించి తేలుస్తామన్నారు. కొత్త ఫారం–6 కు సుప్రీంకోర్టు ఆమోదం ఉందంటూ ఈసీ చేసిన ప్రకటనపై సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మరోసారి అదే వ్యాఖ్య:**

బీహార్ ఎస్ఐఆర్ కేసు విచారణ సందర్భంగా.. తాము సవరించిన 'ఫారం 6'కు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందని ఎన్నికల సంఘం పేర్కొన్నట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. కొత్త ఫారం 6పై సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పు ఇవ్వలేదు. బీహార్ ఎస్ఐఆర్ కేసును విచారించిన సమయంలో ఈ కొత్త ఫారమ్‌కు సంబంధించిన అంశం మా ముందు చర్చకు రాలేదని తేల్చిచెప్పింది. కాగా, బీహార్ ఎస్ఐఆర్‌కు సంబంధించి మే 2026లో వెలువరించిన తీర్పులో తాము కొత్త ఫారం 6 ప్రకటనను సమర్థించినట్లు సెప్టెంబర్ 26న ఎన్నికల సంఘం ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. అయితే, ఈ వాదనను అప్పట్లో (అక్టోబర్ 5న) విచారించిన మరో వేర్వేరు పిటిషన్ల సందర్భంగా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. తాము ఎటువంటి మార్పులకు ఆమోదం తెలపలేదని స్పష్టం చేసింది. తాజాగా సోమవారం మరోసారి ఇదే విషయాన్ని పునరుద్ఘాటించడంతో జాతీయ స్థాయిలో ఎన్నికల ప్రక్రియపై ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం చేస్తే చర్యలు తప్పవు



**మహాదేవపూర్,( భూపాలపల్లి ) ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 67 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశతో ప్రజావాణిని ఆశ్రయిస్తున్నందున, వారి అర్జీల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి అర్జీని వెంటనే సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేశామని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా, అర్జీల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా వారంలోగా చర్యలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అర్జీలపై తీసుకున్న చర్యలు, పరిష్కార పురోగతికి సంబంధించిన వివరాలను తప్పనిసరిగా సంబంధిత పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీకి అత్యంత ప్రాధాన్యతనివ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగంలో నుంచి తీసేశాడని కక్ష..

**బొల్లారం,ఫ్లాష్ ఇండియా :** సికింద్రాబాద్ బొల్లారం పరిధిలోని కౌకూర్ ఆర్కిడ్ విల్లాస్‌లో జరిగిన ఐదేళ్ల చిన్నారి అరేలియా కిడ్నాప్, హత్య ఉదంతం అత్యంత విషాదకరంగా ముగిసింది. విల్లాలో అగ్రికల్చర్ సైంటిస్ట్ మిల్టన్ ఫెర్నాండెజ్ కుమార్తె అయిన అరేలియా, అక్టోబర్ 9న బతుకమ్మ వేడుకలు జరుగుతుండగా ఆడుకుంటూ అదృశ్యమైంది. చిన్నారి వెనుకే మాజీ సెక్యూరిటీ గార్డు విక్రమ్ వెళ్తున్న దృశ్యాలు సీసీటీవీలో రికార్డ్ అయ్యాయి. ప్రవర్తన సరిగా లేదనే కారణంతో విక్రమ్‌ను వారం క్రితం సొసైటీ యాజమాన్యం ఉద్యోగం నుంచి తొలగించింది. ఆ కక్షతోనే అతడు పక్కా ప్లాన్ ప్రకారం చిన్నారిని కిడ్నాప్ చేశాడు. కిడ్నాప్ సమయంలో చిన్నారి అరుపులు బయటకు వినిపించకుండా విలాస్‌లో ఎలక్ట్రీషియన్‌ను పెద్ద సౌండ్ స్పీకర్ పెట్టమని కోరాడు. చిన్నారిని విడిచిపెట్టాలంటే రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విక్రమ్ మరో సెక్యూరిటీ గార్డు వద్ద ఉన్న మొబైల్ ఫోన్ నుంచి పాప తండ్రికి, తాతకు వేర్వేరుగా ఫోన్ కాల్స్ చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వీడియో కాల్‌లో చిన్నారిని చూపించాలని కోరడంతో, భయపడిపోయిన నిందితుడు పాపను బయటకు తీసుకెళ్లలేక, పోలీసులు వస్తారనే ఉద్దేశంతో దారుణానికి ఒడిగట్టాడు. చిన్నారి చేతులు, కాళ్లు కట్టేసి, నడుముకు రెండు ఇటుకలు కట్టి విల్లా ఆర్కిడ్ క్లబ్ హౌస్ సెల్లార్‌లోని వాటర్ సంప్‌లో పడేసి హత్య చేశాడు. చిన్నారి మృతదేహం సెల్లార్‌లో విగతజీవిగా లభించింది. ఈ దారుణంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేసి పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా విక్రమ్‌కు సహకరించిన మరో సెక్యూరిటీ గార్డ్, ఎలక్ట్రీషియన్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు విక్రమ్ కోసం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, కూకట్‌పల్లి, పటాన్‌చెరు, బాల్‌నగర్ పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో గాలింపు చర్యలు చేపట్టారు. రైల్వే స్టేషన్ చుట్టుపక్కల లాడ్జీలు, హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. చివరకు మల్కాజ్‌గిరి స్పెషల్ టీమ్ పోలీసులు సిటీ శివారులోని రైల్వే స్టేషన్ వద్ద నిందితుడు విక్రమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. చిన్నారి కుటుంబ సభ్యులు నిందితుడిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# దొరికిందల్లా దోచుకుంటున్నారు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ. 3,296 కోట్ల విలువైన రేడియల్ రోడ్–2 నిర్మాణ టెండర్లలో భారీ కుంభకోణం జరిగిందని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. తమ సొంత ప్రభుత్వంలోనే ఇలాంటి పరిస్థితులు ఎదురుకావడం బాధాకరమని, సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న శాఖలోనే ఈ దోపిడీ జరుగుతోందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఓ యూట్యూబ్ చానల్‌తో సోమవారం మాట్లాడిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**రూ.600 కోట్ల ప్రజల సొమ్ము దోపిడీ:**

ఈ ప్రాజెక్టులో మూడు ప్యాకేజీలకు సంబంధించి తమ కంపెనీ ఇతర సంస్థల కంటే రూ. 600 కోట్లు తక్కువ ధరకు టెండర్లు వేసినా మా కంపెనీని పక్కన పెట్టారని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. తమ కంపెనీని పక్కన పెట్టి ఇతర రాష్ట్రాలకు చెందిన కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు కోసం అధిక వడ్డీలకు ఇతర చోట్ల ప్రభుత్వం అప్పు చేసిందని తను పక్కన పెట్టేందుకు లేని నిబంధనలు పెట్టారని ఆరోపించారు. నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు అడిగితే ఇవ్వడం లేదని, కానీ అప్పులు తెచ్చిన డబ్బును ఇతర రాష్ట్రాల కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారని మండిపడ్డారు. ఇది తెలంగాణ ప్రజల సొమ్ము. మాకు ఈ పనుల్లో పది రూపాయలు మిగిలితే చాలు.. వంద రూపాయల లాభం అవసరం లేదు. తక్కువ ధరకు టెండర్లు వేస్తే వాటిని ఎందుకు తిరస్కరించాలి? అని ప్రశ్నించారు.

**ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఫోన్లు వచ్చాయి**

ఈ టెండర్లు వేయొద్దని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి కూడా తమకు ఫోన్లు వచ్చాయని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. అయినప్పటికీ తాము పోటీ టెండర్లు వేశామని చెప్పారు. టెండర్ల వ్యవహారంలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, ఈ అంశాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు. తన కంపెనీని డిస్క్వాలిఫై చేయడానికి సంబంధిత అధికారులు ఎవరు? అని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని న్యాయపరంగా ఎదుర్కొంటామని, అవసరమైతే హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు వెళ్తామని తెలిపారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన పరిణామాలే ఇప్పుడు కూడా కనిపిస్తున్నాయని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. తక్కువ ధరకు పనులు చేసేందుకు ముందుకొచ్చిన కంపెనీలను పక్కన పెట్టి, ఎక్కువ ధరలకు ఇతర సంస్థలకు టెండర్లు కట్టబెట్టడం వల్ల ప్రజాధనానికి నష్టం జరుగుతుందని ఆరోపించారు. ప్రభుత్వ వైఖరి మారకపోతే తెలంగాణ ప్రజల సొమ్ము దుర్వినియోగమవుతుందని అన్నారు.

**సింగరేణి మూతపడే పరిస్థితి:**

తెలంగాణలో ఈ మూడేళ్లలో పూర్తిగా అవినీతి పేరుకుపోయిందని సింగరేణి మూతపడే పరిస్థితులు ఉన్నాయని రాజగోపాల్ రెడ్డి సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. దొరిగింది దొరికినట్లు దోచుకుంటుంటే మంచి పద్ధతి కాదన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నా మాలాంటి వారం ఈ దోపిడీపై కొట్లాడుతామన్నారు. ఈ విషయాన్ని తాను వదిలిపెట్టేది లేదని ఏది చేసుకుంటారో చేసుకోండి.. తాను మాత్రం ఈ విషయాన్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఇవాళ కాంగ్రెస్ ముఖ్యనేతలు ఢిల్లీలో చేపట్టిన మార్చ్‌కు తాను దూరంగా ఉండటంపైనా రాజగోపాల్ రెడ్డి స్పందించారు. "ఈ విధంగా దోపిడీ జరుగుతుంటే ఎలా ఢిల్లీ ర్యాలీలో పాల్గొంటాం? రాజగోపాల్ రెడ్డి చేసినా, రేవంత్ రెడ్డి చేసినా తప్పు తప్పే. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న శాఖలోనే అవినీతి జరుగుతుంటే ఎలా చూస్తూ ఊరుకుంటాం? అని ప్రశ్నించారు.

# డిండి ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు తక్షణమే సాగునీరు అందించాలి



**చింతపల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** డిండి ప్రాజెక్టు ఆయకట్టు కింద సాగు చేస్తున్న రైతులకు తక్షణమే సాగునీరు అందించి, ఎండిపోతున్న పంటలను కాపాడాలని బీజేపీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ డిండి మండల అధ్యక్షులు సింగారు సైదా ఆధ్వర్యంలో సోమవారం డిండి మండల కేంద్రంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న గంగిడి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, డిండి ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు సకాలంలో సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు అప్పులు చేసి, వేలాది రూపాయలు పెట్టుబడులుగా పెట్టి సాగు చేసిన పంటలు నీరు లేక ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.

**సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలి**

డిండి ప్రాజెక్టులోకి అవసరమైన నీటిని తరలించి ఆయకట్టు పరిధిలోని పంట పొలాలకు సాగునీరు అందించేలా నీటిపారుదల శాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని గంగిడి మనోహర్ రెడ్డి కోరారు. పంటలు ఎండిపోవడంతో నష్టపోతున్న రైతుల పరిస్థితిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించాలని సూచించారు.

పంట నష్టపోయిన అర్హులైన రైతులకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద బీమా పరిహారం అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వ పరంగా కూడా తగిన సహాయం అందించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించి వారికి న్యాయం చేయాలని అన్నారు. డిండి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించి, వారి పంటలను కాపాడే వరకు భారతీయ జనతా పార్టీ రైతుల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని గంగిడి మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు.

**ధర్నాలో పాల్గొన్న బీజేపీ నాయకులు**

ఈ కార్యక్రమంలో బీజేపీ డిండి మండల ఇన్‌చార్జి, సీనియర్ నాయకులు నక్క వెంకటేష్ యాదవ్, రాష్ట్ర నాయకులు కేతావత్ లాలు నాయక్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకూరి నర్సింహా, జిల్లా ఉపాధ్యక్షులు వానం నరేందర్ రెడ్డి, దేవరకొండ నియోజకవర్గ కన్వీనర్ ఏ.టి. కృష్ణ, నల్లగొండ జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ జల్ద భాస్కర్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి చెల్లమల ప్రవీణ్, బీజేపీ సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్, వనం పుష్పలత, మండల అధ్యక్షులు సింగారు సైదా, జిల్లా కార్యవర్గ సభ్యులు మాదవరం నరసింహారావు, కందుకూరు సర్పంచ్ బర్పటి కొండల్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి నల్లగంతుల వెంకటయ్య, మండల అధ్యక్షులు సుధాకర్, భరత్, వినోద్, అంజి, మండల ప్రధాన కార్యదర్శి కుంభం రామకృష్ణ, అమృత్, సాయికుమార్, రాఘవేంద్ర, ఎస్.ఆర్. శ్రీనివాస్, ఎలకుర్తి జైపాల్, ప్రసాద్, మల్లేష్, చిరంజీవి తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, డిండి ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# దేశంలో రెండో ఆజాదీ ఉద్యమం..

**ఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోడీ తన అధికారాన్ని నిలబెట్టుకునేందుకు గతంలో ఈడీ, సీబీఐ, ఐటీలను వాడుకున్నారని, కానీ ఇప్పుడు వాటితో పని జరగక ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగం చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ వ్యతిరేకుల ఓట్లను తొలగించేలా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు టాస్క్ ఇచ్చారంటూ సంచలన ఆరోపణలు చేశారు. గతంలో ప్రజలకు ఓటు హక్కు కల్పించేందుకు 1950లో తొలిసారి తీసుకువచ్చిన ఎస్ఐఆర్ ప్రక్రియను, నేడు ప్రజల ఓట్లు తొలగించేందుకు బీజేపీ వాడుకుంటోందని రేవంత్ రెడ్డి విమర్శించారు. బీజేపీని తీవ్రంగా వ్యతిరేకించే యువత, నిరుద్యోగులు, పేదల ఓట్లను టార్గెట్ చేసి తొలగించాలని జ్ఞానేశ్ కుమార్ చూస్తున్నారని మండిపడ్డారు. ఎస్ఐఆర్ జరగని రాష్ట్రాల్లో బీజేపీ ఓడిపోయిందని జరిగిన రాష్ట్రాల్లోనే బీజేపీ గెలుస్తోందన్నారు.

**ఇది మరో స్వాతంత్ర్య పోరాటం:**

దేశంలో మతాలు, ప్రాంతాల మధ్య బీజేపీ చిచ్చుపెడుతోందని, పౌరులను రెండు కేటగిరీలుగా విడగొడుతున్నారని సీఎం ఆరోపించారు. శ్రీమంతులు, బీజేపీ అనుకూల వర్గం ఒకవైపు.. పేదలు, గిరిజనులు, బీజేపీ వ్యతిరేక పౌరులు మరోవైపు ఉన్నారన్నారు. దేశంలోని సుమారు 20 శాతం మందిని ఓటు హక్కు లేనివాళ్లుగా మారుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది దేశ భద్రతకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశమని, రాహుల్ గాంధీ చేపట్టిన 'జ్ఞానేశ్ కుమార్ గో బ్యాక్' ఉద్యమమే దేశాన్ని కాపాడబోతోందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**జ్ఞానేశ్ కుమార్ ను తొలగించేందుకు అభ్యంతరమేంటి?:**

ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పులు జరుగుతున్నాయని మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్లు వ్యతిరేకించారని, దీనిబట్టి జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు బయటపడ్డాయని రేవంత్ రెడ్డి అన్నారు. అలాంటి సీఈసీని తొలగించేందుకు ప్రధాని మోడీకి అభ్యంతరం ఏమిటని నిలదీశారు. ఈసీ నియామకానికి సంబంధించి గతంలో ప్రధాని, ప్రతిపక్షనేత, సీజేఐ సభ్యులుగా ఉండేవారని, కానీ 2023లో ఆ నిబంధన మార్చి ప్రధాని, హోంమంత్రి, ప్రతిపక్ష నేతకు ఆ బాధ్యతలు అప్పగించారని గుర్తుచేశారు. జ్ఞానేశ్ కుమార్ వద్దు అని అప్పట్లోనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెచ్చరించారని తెలిపారు.

## జంతర్ మంతర్ అనుమతిపై రగడ..

**ఢిల్లీ :** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టేందుకు కాక్రోచ్ జనతా పార్టీ కి పోలీసులు అనుమతి నిరాకరించిన సంగతి తెలిసిందే. జంతర్ మంతర్ వద్ద నిరసనలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించాలంటే కనీసం 10 రోజుల ముందుగా అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని నిన్న ఢిల్లీ పోలీస్ జాయింట్ కమిషనర్ నూపుర్ ప్రసాద్ చేసిన వ్యాఖ్యలపై సోమవారం సీజేపీ చీఫ్ స్పోక్స్‌పర్సన్ సౌరవ్ దాస్ స్పందించారు. ఎప్పుడు నిరసన తెలపాలో తేదీ, సమయం పోలీసులే చెప్పాలన్నారు. "పోలీసులు ఎవరైనా నిరసన చేపట్టాలంటే 10 రోజుల ముందుగా తమను సంప్రదించాలని చెబుతున్నారు. ఇప్పుడు నిరసన కోసం తేదీ, సమయాన్ని నిర్ణయించి మాకు చెప్పే అవకాశం వారికే ఇస్తున్నాం. ఇందుకోసం వారికి 24 గంటల గడువు ఇస్తున్నాం" అన్నారు.

**గతంలో నిబంధనలు ఉల్లంఘించారు:**

కాగా నిన్న మీడియాతో మాట్లాడిన ఢిల్లీ పోలీస్ జాయింట్ కమిషనర్ నూపుర్ ప్రసాద్ గతంలో జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టేందుకు సీజేపీకి అనుమతి ఇచ్చినప్పటికీ.. పోలీసులు నిర్దేశించిన మార్గదర్శకాలను, పార్టీ ఇచ్చిన హామీలను పాటించలేదని అన్నారు. గతంలో నిబంధనలు పాటించకపోవడం, ప్రస్తుతం నెలకొన్న శాంతిభద్రతల పరిస్థితులు, ప్రజల భద్రత, న్యూఢిల్లీ ప్రాంతంలోని ట్రాఫిక్ నిబంధనలను దృష్టిలో ఉంచుకుని అనుమతి నిరాకరించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం జంతర్ మంతర్ పరిసర ప్రాంతాల్లో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత లోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని పోలీసులు తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతలను కాపాడేందుకు అవసరమైన ఆంక్షలు విధించినట్లు పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసులు హెచ్చరించారు.

## ఫసల్ బీమా అమలు చేయాల్సిందే

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** 2014కు ముందు దేశంలో అనేక కుంభకోణాలు చూశామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక దళారీ వ్యవస్థ లేకుండా లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చారని తెలిపారు. ఈరోజు(సోమవారం) మీడియాతో మాట్లాడుతూ.. రోడ్లు, రైల్వే, ఎయిర్ వేస్‌ను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. తెలంగాణకు 12 ఏళ్లలో పెద్ద ఎత్తున నిధులు కేటాయించారని చెప్పారు. 41 రైల్వే స్టేషన్లను ఆధునికీకరించారని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఛాలెంజ్‌ను తాను స్వీకరిస్తున్నా అని.. ఓట్ డిలీట్ అయిన వాళ్లలో పది మందిని ఎన్నికల కమిషన్ కార్యాలయానికి తీసుకురావాలన్నారు. ఒసామా బిన్ లాడెన్ వారసులు కాంగ్రెస్ పార్టీ నేతలు అంటూ రాంచందర్ రావు విరుచుకుపడ్డారు. దేవుళ్లను ఎగతాళి చేయొద్దని.. హిందువులు ఆగ్రహంతో ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. రైతులు చనిపోతుంటే ముఖ్యమంత్రి, మంత్రులు ప్రత్యేక విమానాల్లో ఢిల్లీకి వెళ్లారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ చేసే పిచ్చి తుగ్లక్ పనులకు పోతారా అంటూ ఫైర్ అయ్యారు. తెలంగాణ ప్రజలు, రైతుల మీద ఉన్న ప్రేమ ఇదేనా రేవంత్ రెడ్డి అంటూ ప్రశ్నించారు. తెలంగాణ రైతులను ఆదుకోవాలని, ఫసల్ బీమా యోజన అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫసల్ బీమా యోజన అమలు చేయకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కాక్రోచ్.. పిక్రోచ్ కలిసి దేశాన్ని ఏం చేయాలనుకుంటున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రశ్నించారు. త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీని తెలంగాణకు రానివ్వమన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు రాహుల్‌ను అడ్డుకుంటామని తెలిపారు. గోవాలో కాదు తెలంగాణలో డ్రగ్స్ పెరిగిపోతోందని.. నషా ముక్త్ భారత్ అనేది తెలంగాణ నుంచే ప్రారంభం కావాలని చెప్పుకొచ్చారు. జ్ఞానేష్ కుమార్‌తో బీజేపీకి ఏం సంబంధమని నిలదీశారు. నిరసనకారులపై ఎలాంటి దాడులు జరగలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముక్త్ భారత్.. త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాల్లో కూడా కాంగ్రెస్ ఎక్కడా గెలవదని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీని కొత్తగా లాంచ్ చేయాలని చూస్తున్నారు కానీ ల్యాండ్ కావడం లేదంటూ రాంచందర్ రావు ఎద్దేవా చేశారు. రాహుల్ పిచ్చి తుగ్లక్ పనులు చేస్తుంటే.. తెలంగాణ నేతలు ఢిల్లీ ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. కేబినెట్ రద్దు చేసి మరీ.. స్పెషల్ ఫ్లైట్‌లో ఢిల్లీ వెళ్లాల్సిన అవసరం ఏముందని రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఢిల్లీని జైలుగా మార్చేశారు..

**న్యూఢిల్లీ :** సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ యువత, ప్రతిపక్షాలు నిరసన చేపడితే పోలీసులు ఢిల్లీలో భయానక వాతావరణం సృష్టించారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ అపొజిషన్ లీడర్ రాహుల్ గాంధీ ఫైర్ అయ్యారు. ఢిల్లీలో బస్సులు, మెట్రో, రైళ్లను నిలిపివేసి ప్రజారవాణా వ్యవస్థను ఎక్కడికక్కడ స్తంభింపజేశారని మండిపడ్డారు. ఎమర్జెన్సీ తరహాలో రోడ్లపై సుమారు 30 వేల మంది పోలీసులను మోహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీని జైలుగా మార్చి.. ఎక్కడా ఆందోళన తెలిపిన అరెస్ట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. నిరసనలో పాల్గొన్న యువతపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ గుండాలు దాడులు చేశారని ఆరోపించారు. పోలీసులు విపక్ష నేతలను అడ్డుకుని.. బీజేపీ, ఆర్ఎస్ఎస్ గుండాలకు యథేచ్ఛగా వదిలేశారని మండిపడ్డారు. సర్ ప్రక్రియలో అక్రమాలు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఉద్యమం ఉధృతం చేసింది. ఇందులో భాగంగానే సోమవారం (అక్టోబర్ 12) సుప్రీంకోర్ట్ వరకు భారీ శాంతియుత ర్యాలీకి పిలుపునిచ్చింది. ఈ ర్యాలీకి ముందు కాంగ్రెస్ నేతలకు దిశానిర్దేశం చేయడంతో పాటు ఢిల్లీ పోలీసుల వ్యవహరిస్తోన్న తీరును రాహుల్ గాంధీ వివరించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. సర్ పేరుతో దేశంలో ఓట్ చోరీ జరుగుతోందన్నారు. సర్‌కు వ్యతిరేకంగా దేశంలో ప్రజా ఉద్యమం మొదలైందని తెలిపారు. సర్ పక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్న సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఎందుకు రాజీనామా చేయట్లేదని ప్రశ్నించారు. జ్ఞానేష్ కుమార్‌ను ప్రధాని మోడీ ఎందుకు కాపాడుతున్నారని నిలదీశారు. దేశ ప్రజలంతా ఒకవైపు ఉన్నరు.. ప్రధాని మోడీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్ ఒక వైపు ఉన్నారన్నారు. తప్పు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. దేశంలో ప్రజా స్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుతామని పేర్కొన్నారు.

**కేంద్రంలోని 200 మంది అధికారులు మాతో టచ్‌లో ఉన్నారు.. : రాహుల్**

కేంద్ర ప్రభుత్వంలోని 200 మంది అధికారులు మాతో టచ్‌లో ఉన్నారు అంటూ రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. అందులో ఈడీ, సీబీఐ మరియు ఫారెస్ట్‌కి చెందినవాళ్లు కూడా ఉన్నారన్నారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇది మోదీ-రాహుల్ మధ్య జరిగే యుద్ధం కాదని... దేశ యువత భవిష్యత్తు, రాజ్యాంగాన్ని రక్షించడం కోసం జరుగుతున్న పోరాటం అని చెప్పారు. ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఆ ఐదుగురు నేరగాళ్లు న్యాయవిచారణ ఎదుర్కొనే వరకు వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. జ్ఞానేశ్ కుమార్ అప్రూవర్‌గా మారితే వదిలేస్తానని అన్నారు. జ్ఞానేశ్ కుమార్ ప్రధాన నేరస్తుడు కాదని అన్నారు. కానీ ఆయన తప్పు చేశాడని, ఆ తప్పు వెనుక ఉన్నది మోడీ, అమిత్ షా అని వ్యాఖ్యానించారు. జ్ఞానేశ్ కుమార్ ఈ మీడియా సమావేశం చూస్తున్నాడని అది తనకు తెలుసని అన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసి తప్పుకుంటే వదిలేస్తామని చెప్పారు. ఎన్నికల కమిషనర్లు లేవనెత్తిన ప్రశ్ననే తాము అడుగుతున్నామని, జ్ఞానేశ్ కుమార్ ఎందుకు రాజీనామా చేయడం లేదు? అని ప్రశ్నించారు. ఎన్నికల కమిషనర్‌గా జరిగిన వ్యవహారాలపై జ్ఞానేశ్ సమాధానం చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆయన వ్యవహారశైలిపై లక్షలాది మంది ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఈ ప్రశ్నలు ఆగవు.. ప్రజలు నిలదీస్తూనే ఉంటారని స్పష్టం చేశారు. ఢిల్లీని కోటలా మార్చేశారని, ఎక్కడ చూసినా భారీగా పోలీసులు మోహరించారని ఆరోపించారు.

## జనసంద్రమైన ఢిల్లీ రోడ్లు..

**ఢిల్లీ :** ఢిల్లీ రోడ్లు జనసంద్రంలా మారాయి. ఓట్ చోర్.. గద్దీ ఛోడ్..జ్ఞానేష్ కుమార్ రాజీనామా నినాదాలతో మారుమోగి పోతున్నాయి. కన్నాట్ నుంచి సుప్రీం కోర్టు దిశగా వెళ్తున్న డెమొక్రసీ మార్చ్ లో ఇండియా కూటమి నేతలు చేయి చేయి కలపడంతో ఊహించని విధంగా సాగుతోంది. 2026 అక్టోబర్ 12న డెమొక్రసీ మార్చ్ పేరున ఇండియా కూటమి ఛలో సుప్రీం కోర్టు ర్యాలీని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ముందుండి నడిపిస్తున్నారు. అడుగడుగునా శ్రేణులకు సలహాలు ఇస్తూ.. ముందుండి మార్చ్ ను విజయవంగంగా నడిపిస్తున్నారు. రాహుల్, ప్రియాంకతో కలిసి నేహాబొరా మార్చ్ లో పాల్గొన్నారు. మండి హౌస్, బరాఖంబా రోడ్ సమీపలో ఇసకేస్తే రాలనంత జనంతో మార్చ్ ముందుకు సాగింది. కూటమి ర్యాలీలో తృణమూల్ కాంగ్రెస్, ఆర్జేడీ, సమాజ్ వాదీ పార్టీ, వామపక్ష పార్టీలు పాల్గొన్నాయి. ముఖ్య నేతలతో పాటు పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ర్యాలీ పార్గొన్నారు. భగవన్ దాస్ రోడ్డు దగ్గర నిరసనలో జాయిన్ అయ్యారు. అదేవిధంగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు రేవంత్, డీకే శివకుమార్, సుఖ్వీందర్ సింగ్,వీడీ సతీషన్, మంత్రులు పాల్గొన్నారు. జాతీయ జెండాలతో, కాంగ్రెస్ తో పాటు వివిధ పార్టీల జెండాలతో కార్యకర్తలు కదం తొక్కారు. అదే విధంగా సర్ ప్రక్రియ అక్రమాలపై ఫ్లకార్డులను ప్రదర్శిస్తూ ముందుకు సాగారు. ఓట్ చోర్ దిగిపోవాలనే నినాదాలతో బరాఖంబా రోడ్లు దద్దరిల్లుతన్నాయి. సీఈసీ జ్ఞానేష్ రాజీనామా చేయాలని డిమాండ్ తో ఇండియా కూటమి నేతలు,శ్రేణులు ముందుకు సాగుతున్నాయి. మరోవైపు రాహుల్ గాంధీ ర్యాలీలో ఉండటంతో ఆయన లీగల్ టీమ్ సుప్రీకోర్టుకు చేరుకుని పిటిషన్ సమయాన్ని పొడిగించాలని కోరింది. అయితే రాహుల్ ర్యాలీలో ఉండటంతో ఆయన లీగ్ టీమ్ పిటిషన్ దాఖలు చేసింది.

## కాంగ్రెస్ యాక్షన్ ప్లాన్ ఏంటి



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు(సోమవారం) మీడియాతో మాట్లాడుతూ.. రైతు కూలీలకు డబ్బులు ఇవ్వడానికి కాంగ్రెస్‌కు మనసు లేదని మండిపడ్డారు. పంటలు వేయొద్దంటే రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రైతు కూలీలు ఎలా బతకాలి.. వలసలు పోవాలా అని నిలదీశారు. బీఆర్ఎస్ ఉన్నపుడు వలసలు వాపస్ వచ్చాయని.. ఇప్పుడు మళ్లీ వలసలు మొదలయ్యాయని విమర్శించారు. రైతులు డీజిల్ ఇంజిన్‌లు పెట్టుకుని పంటలను కాపాడుకుంటున్నారని.. ప్రతి దానికీ ఎల్‌నినోతో లింక్ పెడుతున్నారని మండిపడ్డారు. బొగ్గు లేదంటే కూడా ఎల్‌నినో అంటున్నారన్నారు. సర్కార్ నిర్లక్ష్యం వల్లే రాష్టానికి ఈ పరిస్థితి వచ్చిందని విరుచుకుపడ్డారు. దేవాదులలో మోటార్లు ఎందుకు నడపడం లేదని ప్రశ్నించారు. సింగూరు ప్రాజెక్ట్‌లో వాడుకునేందుకు రెండు టీఎంసీలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఆ నీళ్లను కూడా బీర్ల కంపెనీలకు ఇస్తున్నారని ఆరోపించారు. దసరా లిక్కర్‌కు షార్టేజ్ రావొద్దని వాళ్లకు నీళ్లు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యమని ప్రశ్నించారు. సింగూరుపై కాంగ్రెస్ యాక్షన్ ప్లాన్ ఏంటని ప్రశ్నించారు. పంటల కోసం జూరాల గేట్లు తెరిస్తే రైతులను జైలుకు పంపారని.. తాగునీరు ఇవ్వకుండా బీర్ల కంపెనీలకు నీళ్లు ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. నీళ్లుండి కూడా ఎత్తని ప్రభుత్వం ఇది అంటూ మండిపడ్డారు. రైతులతో గంట సేపు మాట్లాడే సమయం ముఖ్యమంత్రికి లేదా అంటూ ప్రశ్నించారు. బీర్ల కంపెనీలకు నీళ్లు, ఢిల్లీలో రాజకీయాలు తప్ప ఈ ప్రభుత్వానికి ఇంకో పని లేదని హరీశ్ రావు విమర్శించారు.



## ఏసీబీ కోర్టులో కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈరోజు(సోమవారం) నాంపల్లి ఏసీబీ కోర్ట్‌లో ఈ పిటిషన్ వేశారు. ఈ కేసుకు సంబంధించి ఏసీబీ వేసిన ఛార్జ్‌షీట్‌లో తన పేరును తొలగించాలని మాజీ మంత్రి కోరారు. నిందితుల జాబితా నుంచి తన పేరును తప్పించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. కేటీఆర్ వేసిన డిశ్చార్జ్ పిటిషన్‌పై నాంపల్లి కోర్టు వచ్చే నెలలో(నవంబర్) విచారణ జరపనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో ఏ1 నిందితుడిగా కేటీఆర్ పేరును ఏసీబీ అధికారులు ఛార్జ్‌షీట్‌లో చేర్చిన విషయం తెలిసిందే. ఏసీబీ వేసిన ఛార్జ్‌షీట్‌ను న్యాయస్థానం పరిగణలోకి తీసుకుంది. ఈ కేసులో ఇప్పటికే కేటీఆర్ రెండు సార్లు కోర్టు విచారణకు హాజరయ్యారు. ఇప్పుడు తాజాగా ఏసీబీ ఛార్జ్‌షీట్‌లో తన పేరును తొలగించాలంటూ కేటీఆర్ వేసిన డిశ్చార్జ్ పిటిషన్ వేశారు. దీనిపై త్వరలోనే ఏసీబీ కోర్ట్ విచారణ చేయనున్నట్లు సమాచారం.

## చౌడాపూర్ మండలంలో రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ



**వికారాబాద్ జిల్లా/ చౌడాపూర్ మండల,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** చౌడాపూర్, మరికల్, కొత్తపల్లి పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం! తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం చౌడాపూర్ మండలంలోని చౌడాపూర్, మరికల్, కొత్తపల్లి గ్రామ పంచాయతీలలో విజయవంతంగా నిర్వహించడం జరిగింది. మన ప్రియతమ పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ SIR ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డా. టి. రామ్మోహన్ రెడ్డి గారి సూచనల మేరకు ఆయా గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు రేషన్ స్మార్ట్ కార్డులను CMRF cheq పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం. చంద్రశేఖర్, PACS వైస్ చైర్మన్ ఏలపాటి అశోక్ కుమార్, సర్పంచులు నవీన్ కుమార్, ఇందిరా సత్యకుమార్, రజిత నర్సింహులు మాట్లాడుతూ...తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా కృషి చేస్తామని, పేద ప్రజల ఆహార భద్రతకు రేషన్ స్మార్ట్ కార్డులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

**ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు:**

ఉప సర్పంచ్ల సంఘము రాష్ట్ర అధ్యక్షులు గోపాల్ఉ,ప సర్పంచ్లు ,రాములమ్మ శ్రీను. పాండు. ఆత్మ కమిటీ డైరెక్టర్ రాజేందర్ రెడ్డి, సలీమ్, వెంకటయ్య గౌడ్, ,గాూజా డైరెక్టర్ వెంకటయ్య. చెన్నయ్య, కాంగ్రెస్ నాయకులు రవి కుమార్, పంచాయతీ కార్యదర్శి రమేష్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాము,RI రవి కుమార్,అలాగే మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజాప్రతినిధులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే మా లక్ష్యం.

## బీటీ రోడ్డు పనులను పరిశీలించిన పిఏసిఎస్ వైస్ చైర్మన్



**వికారాబాద్ జిల్లా/చౌడాపూర్, ఫ్లాష్ ఇండియా,ప్రతినిధి :**

ఈ రోజు చౌడాపూర్ మండలంలోని హిర్లవాగు తండా గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన పచ్చవ్ కుంట తండా కు వెళ్తున్న దీ రోడ్డు పనులను పిఏసిఎస్ వైస్ చైర్మన్ ఎల్పటి అశోక్ కుమార్, పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఎక్కడా రాజీ పడవద్దని కాంట్రాక్టర్ కు సూచించారు. గ్రామ ప్రజలకు ఎంతో కాలంగా ఉన్న రోడ్డు సమస్య త్వరలో పరిష్కారం కానుందని, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నాణ్యమైన రోడ్డు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ సలీమ్ , గ్రామ పెద్దలు. వల్య నాయక్. రాజు, తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం



# హైస్పీడ్ రైల్ కారిడార్ల వివాదం..

తెలంగాణ రాజకీయాల్లో హైస్పీడ్ రైల్ కారిడార్ల అంశం కొత్త రాజకీయ వివాదానికి కేంద్రబిందువుగా మారుతోంది. ముంబయి, బెంగళూరు, చెన్నై వంటి ప్రధాన నగరాలకు తెలంగాణను అనుసంధానించే హైస్పీడ్ రైలు మార్గాల నిర్మాణం రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన అంశమే అయినప్పటికీ, వాటి అలైన్‌మెంట్‌పై స్పష్టత రాకముందే భూముల వ్యవహారం తెరపైకి రావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమావేశం అనంతరం వెలువడిన ప్రకటన ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇబ్బందికరమైన ప్రశ్నలను సంధిస్తోంది. హైస్పీడ్ రైలు కారిడార్ల మార్గాలు ఇంకా ఖరారు కాలేదని, అధ్యయన దశలోనే ఉన్నాయని కిషన్‌రెడ్డి వెల్లడించడం ఈ వివాదానికి కీలక మలుపుగా మారింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రైల్వే హబ్, కారిడార్ల పేరుతో భూముల సేకరణకు ప్రయత్నిస్తోందంటూ బీఆర్ఎస్ ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో కేంద్రం నుంచి వచ్చిన ఈ సంకేతం కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ రాజకీయ పోరుకు కొత్త కోణాన్ని జోడిస్తోంది. ఈ వ్యవహారంలో మొదట గుర్తించాల్సిన అంశం అభివృద్ధి ప్రాజెక్టుల ప్రకటనలకు, వాటి అమలుకు మధ్య ఉన్న వ్యత్యాసం. హైస్పీడ్ రైలు కారిడార్లు తెలంగాణకు వస్తే ప్రయాణ సమయం తగ్గడంతోపాటు పారిశ్రామిక, వాణిజ్య, రియల్ ఎస్టేట్ రంగాలకు అవకాశాలు పెరగవచ్చు. ప్రధాన నగరాలతో వేగవంతమైన రవాణా అనుసంధానం ఏర్పడితే పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు కూడా పెరిగే అవకాశం ఉంటుంది. అయితే ఇలాంటి భారీ ప్రాజెక్టులకు మార్గ నిర్ధారణ, సాధ్యాసాధ్యాల అధ్యయనం, సాంకేతిక అనుమతులు, భూసేకరణ విధానం వంటి అనేక దశలు ఉంటాయి. వాటికి సంబంధించిన అధికారిక నిర్ణయాలు వెలువడకముందే భూముల గుర్తింపు లేదా సేకరణపై సందేహాలు తలెత్తితే ప్రజల్లో గందరగోళం ఏర్పడుతుంది. ముఖ్యంగా వ్యవసాయ భూములపై ఆధారపడే రైతులు తమ భవిష్యత్తు ఏమవుతుందోనని ఆందోళన చెందుతారు. అందువల్ల ఈ వివాదాన్ని రాజకీయ విమర్శలకే పరిమితం చేయకుండా, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేసిన ప్రకటనను రాజకీయంగా పరిశీలిస్తే, అది బీజేపీకి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశాన్ని కల్పిస్తోంది. కారిడార్ల అలైన్‌మెంట్ ఇంకా ఖరారు కాలేదన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఏ ప్రాతిపదికన భూములకు సంబంధించి చర్యలు చేపట్టిందనే ప్రశ్నను బీజేపీ లేవనెత్తవచ్చు. అయితే అలైన్‌మెంట్ ఖరారు కాలేదని చెప్పడం ఒక్కటే రాష్ట్ర ప్రభుత్వం చట్టవిరుద్ధంగా వ్యవహరించిందని నిరూపించదు. భూముల గుర్తింపు, ప్రాథమిక సర్వే, అధికారిక భూసేకరణ ప్రక్రియలు వేర్వేరు దశలు. వాటిలో ఏ చర్య చేపట్టారో సంబంధిత ఉత్తర్వులు, ప్రభుత్వ రికార్డుల ఆధారంగా మాత్రమే నిర్ధారించాలి. ఈ తేడాను పక్కనపెట్టి రాజకీయ ఆరోపణలు చేయడం వల్ల సమస్య పరిష్కారం కాకపోగా, రైతుల్లో అనవసర భయాందోళనలు పెరిగే ప్రమాదం ఉంది. బీజేపీకి రాజకీయంగా లభించిన అవకాశాన్ని ప్రజలకు వాస్తవాలు వివరించే దిశగా ఉపయోగిస్తుందా, లేక కాంగ్రెస్‌పై విమర్శలకే పరిమితం చేస్తుందా అనేది కీలకం. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ఈ వ్యవహారం రాజకీయంగా పరీక్షే. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకురావడం, మౌలిక సదుపాయాలను విస్తరించడం, హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చేయడం వంటి లక్ష్యాలను ముందుకు తెస్తోంది. ఈ క్రమంలో హైస్పీడ్ రైలు కారిడార్లు రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలో భాగమైతే వాటి పురోగతిపై స్పష్టత ఇవ్వాల్సి ఉంటుంది. కేంద్రం ఇంకా మార్గాలను ఖరారు చేయలేదని చెబుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భూముల గుర్తింపు, రైల్వే హబ్ ప్రతిపాదనలు, సంబంధిత ప్రాంతాల్లో చేపట్టిన చర్యలపై వివరాలు వెల్లడించాలి. ఏ పనులు ప్రాథమిక అధ్యయనంలో భాగంగా చేపట్టారు? అధికారికంగా భూసేకరణ నోటిఫికేషన్లు జారీ అయ్యాయా? రైతులకు ఏవైనా హామీలు ఇచ్చారా? కేంద్ర రైల్వే శాఖతో రాష్ట్రానికి ఉన్న అవగాహన ఏమిటి? వంటి ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానాలు ఇవ్వడం అవసరం. పారదర్శకత లోపిస్తే ప్రతిపక్షాలకు విమర్శించే అవకాశం మరింత పెరుగుతుంది. ఇక్కడ బీఆర్ఎస్ పాత్రను కూడా విస్మరించలేం. రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారిలా వ్యవహరిస్తోందంటూ ఆ పార్టీ చేస్తున్న విమర్శలకు ఈ పరిణామం మరింత ప్రచారం కల్పించవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నిస్తూ రైతుల భూముల రక్షణను ప్రధాన రాజకీయ అంశంగా మలచుకునే ప్రయత్నం బీఆర్ఎస్ చేయవచ్చు. అయితే గతంలో అధికారంలో ఉన్న పార్టీగా బీఆర్ఎస్ కూడా అభివృద్ధి ప్రాజెక్టులు, భూవినియోగ విధానాలు, రైతుల ప్రయోజనాల విషయంలో తన వైఖరిని స్పష్టంగా వివరించాల్సి ఉంటుంది. కేవలం ప్రస్తుత ప్రభుత్వాన్ని విమర్శించడం కంటే, రైతులకు న్యాయం జరిగేలా ఎలాంటి విధానాలు ఉండాలనే అంశంపై నిర్మాణాత్మక ప్రతిపాదనలు చేయడం ద్వారా ప్రజల్లో విశ్వసనీయతను పెంచుకోవచ్చు. ఈ వివాదం కాంగ్రెస్, బీజేపీ మధ్య పోరుగా మాత్రమే కాకుండా, బీఆర్ఎస్‌కు కూడా రాజకీయంగా తన స్థానాన్ని బలోపేతం చేసుకునే అవకాశంగా మారవచ్చు. తెలంగాణలో రాజకీయ పార్టీలు ఇప్పటికే భవిష్యత్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తమ వ్యూహాలను రూపొందించుకుంటున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు వంటి రాజకీయ సందర్భాల్లో రైతుల సమస్యలు, అభివృద్ధి హామీలు, ప్రభుత్వ పనితీరు కీలక అంశాలుగా మారే అవకాశం ఉంది. మరోవైపు రాష్ట్రంలో అధికారాన్ని సాధించడమే లక్ష్యంగా బీజేపీ సంస్థాగత బలోపేతంపై దృష్టి సారిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో హైస్పీడ్ రైల్ కారిడార్ల వివాదం రాజకీయ ప్రచారానికి ఉపయోగపడినా, దాని ప్రభావం ఎంతవరకు ఉంటుందనేది పార్టీల ప్రతిస్పందనపై ఆధారపడి ఉంటుంది. రైతుల భూములపై నిజమైన సమస్యలు ఉన్నాయా, ప్రభుత్వం వాటిని ఎలా పరిష్కరిస్తోంది, కేంద్రం ప్రాజెక్టులపై ఎలాంటి స్పష్టత ఇస్తోంది అనే అంశాలే చివరకు ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేస్తాయి. ఈ వివాదంలో అసలు ప్రాధాన్యం రైతుల ప్రయోజనాలకే దక్కాలి. భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి అవసరమే. కానీ అభివృద్ధి పేరుతో రైతుల్లో అనిశ్చితి పెరగకూడదు. భూముల సేకరణ అవసరమైతే చట్టబద్ధమైన ప్రక్రియను పాటించడం, ప్రభావిత రైతులకు సరైన సమాచారం అందించడం, న్యాయమైన పరిహారం కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. కేంద్రం, రాష్ట్రం మధ్య సమన్వయం లేకపోతే ప్రాజెక్టులు ఆలస్యమవడమే కాకుండా ప్రజల్లో ప్రభుత్వాలపై నమ్మకం కూడా తగ్గుతుంది. అందువల్ల రాజకీయ విమర్శల కంటే అధికారిక సమాచారాన్ని వెల్లడించడం, అనుమానాలను నివృత్తి చేయడం, రైతులతో సంప్రదింపులు జరపడం తక్షణ అవసరం. మొత్తంగా హైస్పీడ్ రైల్ కారిడార్ల అంశం కాంగ్రెస్ ప్రభుత్వానికి వివరణ ఇవ్వాల్సిన పరిస్థితిని సృష్టించగా, బీజేపీకి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే రాజకీయ అవకాశాన్ని కల్పించింది. బీఆర్ఎస్ కూడా ఈ వివాదాన్ని తన రాజకీయ వ్యూహంలో భాగం చేసుకునే అవకాశం ఉంది. అయితే ఈ వ్యవహారంలో ఎవరు పైచేయి సాధిస్తారనే దానికంటే, ప్రాజెక్టులపై వాస్తవ పరిస్థితులు ఏమిటి, భూసేకరణకు సంబంధించి ఏ చర్యలు చేపట్టారు, రైతులకు ఎలాంటి రక్షణ కల్పిస్తారు అనేవే ముఖ్యమైన ప్రశ్నలు. రాజకీయంగా ఎవరు లాభపడతారన్నది కాలమే నిర్ణయిస్తుంది. కానీ ప్రభుత్వాల పారదర్శకత, బాధ్యతాయుతమైన వ్యవహారం, రైతుల ప్రయోజనాల పరిరక్షణే ఈ వివాదానికి సరైన పరిష్కార మార్గాన్ని చూపగలవు.

# వాతావరణ మార్పులపై మేల్కొందాం!

సాధారణంగా అక్టోబరు నెల వచ్చిందంటే వర్షాకాలం ముగింపు దశకు చేరుకుని, వాతావరణంలో చల్లదనం మొదలవుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరమైన గాలులు వీస్తూ ప్రజలకు ఉపశమనం కలిగిస్తాయి. వేసవి ఎండల నుంచి బయటపడిన ప్రజలు శరదృతువు ఆహ్లాదాన్ని ఆస్వాదిస్తారు. అయితే ఈ ఏడాది తెలంగాణలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. అక్టోబరు నెలలోనూ భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండటంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 37 డిగ్రీల సెల్సియస్‌ను దాటడం, నెల చివరి నాటికి కొన్ని ప్రాంతాల్లో 40 డిగ్రీలకు చేరే అవకాశాలున్నాయన్న అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సాధారణంగా చల్లబడాల్సిన వాతావరణం ఇలా వేడెక్కడం వెనుక ఉన్న కారణాలను విశ్లేషించడంతోపాటు, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలపై దృష్టి సారించాల్సిన సమయం ఆసన్నమైంది. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నల్గొండ జిల్లా కట్టంగూర్‌లో 37.4 డిగ్రీలు, ఖమ్మం జిల్లా పెనుబల్లిలో 37.3 డిగ్రీలు, పెద్దపల్లి జిల్లా రామగిరిలో 37.2 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు, నిజామాబాద్ జిల్లా మెండోర, సూర్యాపేట జిల్లా మునగాల, కుమురం భీం జిల్లా సిర్పూర్ ప్రాంతాల్లోనూ ఉష్ణోగ్రతలు 37 డిగ్రీల వరకు చేరాయి. మహబూబాబాద్ జిల్లా కురవిలో 36.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ గణాంకాలు అక్టోబరు నెలలోనూ ఎండ తీవ్రత ఏ స్థాయిలో కొనసాగుతోందో స్పష్టం చేస్తున్నాయి. ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలను మించి నమోదవుతున్నప్పుడు వాటి ప్రభావాన్ని కేవలం అసౌకర్యంగా మాత్రమే చూడలేం. ప్రజారోగ్యం, వ్యవసాయం, నీటి వినియోగం, విద్యుత్ అవసరాలు వంటి అనేక రంగాలపై దీని ప్రభావం పడుతుంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనేక కారణాలు ఉండవచ్చు. నైరుతి రుతుపవనాల తిరోగమనంలో జాప్యం, ఆకాశం నిర్మలంగా ఉండటం, సూర్యరశ్మి నేరుగా భూమిపై పడటం, తూర్పు దిశ నుంచి వేడి గాలులు వీయడం వంటి అంశాలు ఉష్ణోగ్రతల పెరుగుదలకు దోహదపడవచ్చు. ఎల్‌నినో పరిస్థితులు కూడా ప్రపంచవ్యాప్తంగా వాతావరణ వ్యవస్థలపై ప్రభావం చూపగలవు. అయితే తెలంగాణలో ప్రస్తుతం నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలకు ఎల్‌నినో ఒక్కటే కారణమని నిర్ధారించడం శాస్త్రీయంగా సమంజసం కాదు. స్థానిక వాతావరణ పరిస్థితులు, గాలుల దిశ, మేఘాల కదలికలు, వర్షపాతం, భూమి ఉపరితల లక్షణాలు వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. వాతావరణ మార్పులపై ప్రజల్లో అవగాహన పెంచే క్రమంలో శాస్త్రీయ సమాచారాన్ని ఆధారంగా చేసుకుని విశ్లేషించడం అవసరం. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు బయటకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రైతులు, వ్యవసాయ కూలీలు, నిర్మాణ రంగ కార్మికులు, వీధి వ్యాపారులు, రహదారులపై పనిచేసే సిబ్బంది ఎండ ప్రభావానికి ఎక్కువగా గురవుతున్నారు. వీరిలో చాలామందికి పని చేయకపోతే రోజువారీ ఆదాయం కోల్పోయే పరిస్థితి ఉంటుంది. మరోవైపు, ఎండలో ఎక్కువసేపు పనిచేయడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. అందువల్ల అధిక ఉష్ణోగ్రతల సమస్యను వ్యక్తిగత జాగ్రత్తలకే పరిమితం చేయకుండా, కార్మికుల జీవనోపాధి, పని పరిస్థితులు, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన అంశంగా చూడాలి. అవసరమైన చోట పని వేళలను మార్చడం, మధ్యమధ్యలో విశ్రాంతి తీసుకునే అవకాశం కల్పించడం, తాగునీరు అందుబాటులో ఉంచడం వంటి చర్యలను సంబంధిత యాజమాన్యాలు, ప్రభుత్వ విభాగాలు చేపట్టాలి. ఎండ తీవ్రత పెరిగినప్పుడు వడదెబ్బ, శరీరంలో నీటి శాతం తగ్గడం, అలసట, తల తిరగడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలున్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలి. ప్రజలు తగినంత నీరు తాగడం, వీలైనంతవరకు మధ్యాహ్నం వేళల్లో ప్రత్యక్ష ఎండకు దూరంగా ఉండటం, తేలికపాటి దుస్తులు ధరించడం వంటి జాగ్రత్తలు పాటించాలి. తీవ్రమైన నీరసం, గందరగోళం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే అత్యవసర వైద్య సహాయం పొందాలి. ప్రభుత్వం కూడా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన సదుపాయాలను సిద్ధంగా ఉంచాలి. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు వాతావరణ హెచ్చరికలు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలి. పాఠశాలలు, కార్యాలయాలు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో ఎండ తీవ్రతపై అవగాహన కల్పించడం కూడా కీలకం. ఇదే సమయంలో పట్టణీకరణ, పర్యావరణ విధానాలపై కూడా సమీక్ష అవసరం. నగరాలు, పట్టణాల్లో చెట్లను తొలగించి భవనాలు, రహదారులు నిర్మించడం, చెరువులు కబ్జాలకు గురికావడం, పచ్చని ప్రదేశాలు తగ్గిపోవడం వంటి పరిణామాలు స్థానికంగా ఉష్ణోగ్రతలు పెరగడానికి దోహదపడతాయి. కాంక్రీట్ భవనాలు, తారు రహదారులు పగటిపూట వేడిని గ్రహించి, రాత్రివేళల్లో కూడా విడుదల చేస్తాయి. దీనివల్ల పట్టణ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ సమస్యను ఎదుర్కోవడానికి నగరాభివృద్ధిలో పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వాలి. చెరువులు, కుంటలు, సహజ నీటి ప్రవాహ మార్గాలను సంరక్షించాలి. పార్కులు, బహిరంగ ప్రదేశాలు, రహదారుల వెంట నీడనిచ్చే చెట్లను పెంచాలి. అభివృద్ధి అవసరమే అయినప్పటికీ, ప్రకృతిని దెబ్బతీసే అభివృద్ధి దీర్ఘకాలంలో ప్రజలకు నష్టాన్ని కలిగిస్తుందని పాలకులు గుర్తించాలి. నీటి వనరుల పరిరక్షణ కూడా ఈ సమస్యలో కీలకమైన అంశం. ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు తాగునీటి అవసరాలు అధికమవుతాయి. భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంటుంది. ఇప్పటికే నీటి సమస్యలు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో పరిస్థితి మరింత క్లిష్టంగా మారవచ్చు. అందువల్ల వర్షపు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పునర్భరణ, నీటి వృథాను అరికట్టడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ నీటి వనరులను పునరుద్ధరించడం, పట్టణాల్లో వర్షపు నీటిని నిల్వ చేసే వ్యవస్థలను ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్తు అవసరాలకు కొంతవరకు సిద్ధపడవచ్చు. నీటి సంరక్షణను కేవలం వేసవికాలపు కార్యక్రమంగా కాకుండా ఏడాది పొడవునా కొనసాగించాల్సిన సామూహిక బాధ్యతగా చూడాలి. వాతావరణ శాఖ ఈశాన్య రుతుపవనాల ప్రారంభం, బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలను పరిశీలిస్తున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవచ్చు. అయితే వర్షాలు కురుస్తాయనే అంచనాలతో ప్రస్తుత ఎండ తీవ్రతను తక్కువగా అంచనా వేయకూడదు. వర్షపాతం, ఉష్ణోగ్రతలు ప్రాంతాన్ని బట్టి మారవచ్చు. అందువల్ల వాతావరణ శాఖ తాజా హెచ్చరికలను ప్రజలు గమనించాలి. ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ, ప్రజలకు అవసరమైన సమాచారాన్ని చేరవేయాలి. వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి చర్యలు చేపట్టడం వల్ల ఆరోగ్య సమస్యలను తగ్గించడంతోపాటు, వ్యవసాయం, నీటి నిర్వహణ, విద్యుత్ సరఫరా వంటి రంగాల్లో ఎదురయ్యే ఇబ్బందులను కూడా కొంతవరకు నియంత్రించవచ్చు. మొత్తంగా చూస్తే, అక్టోబరు నెలలోనే వేసవిని తలపించే ఎండలు నమోదవడం సాధారణంగా తీసుకోవాల్సిన పరిణామం కాదు. ఒకవైపు తక్షణమే ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకుంటూనే, మరోవైపు పర్యావరణ పరిరక్షణకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలి. వాతావరణ మార్పులపై పరిశోధనలు, స్థానిక ఉష్ణోగ్రతల నమోదుపై నిరంతర పర్యవేక్షణ, ప్రజలకు అవగాహన, ప్రకృతి వనరుల సంరక్షణ వంటి అంశాలకు ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రజలు కూడా నీటిని పొదుపుగా వినియోగించడం, చెట్లను పెంచడం, పర్యావరణానికి హాని కలిగించే చర్యలను తగ్గించడం వంటి బాధ్యతలను స్వీకరించాలి. ఎండలు తగ్గిన తర్వాత ఈ సమస్యను మర్చిపోవడం కాకుండా, అసాధారణ వాతావరణ పరిస్థితుల నుంచి పాఠాలు నేర్చుకోవాలి. ప్రకృతిని కాపాడటం అంటే కేవలం పర్యావరణాన్ని రక్షించడం మాత్రమే కాదు; ప్రజల ఆరోగ్యం, జీవనోపాధి, నీటి భద్రత, భవిష్యత్ తరాల జీవన ప్రమాణాలను కాపాడటమూ. అందుకే ఇప్పుడే మేల్కొని, శాస్త్రీయ అవగాహనతో ముందుకు సాగడం సమాజానికి అత్యవసరం.

# నాయకులపై ఆరోపణల కలకలం!



తెలంగాణలో భూముల వ్యవహారాలు మరోసారి రాజకీయ చర్చకు కేంద్రబిందువుగా మారుతున్నాయి. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఫామ్‌ల్యాండ్ వెంచర్ల చుట్టూ వినిపిస్తున్న అక్రమ వసూళ్ల ఆరోపణలు అధికార, ప్రతిపక్ష పార్టీలకు సవాలుగా మారుతున్నాయి. ఒకప్పుడు వ్యవసాయంపై ఆధారపడిన ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు పెరగడంతో భూముల ధరలు గణనీయంగా పెరిగాయని స్థానికంగా చెబుతున్నారు. అయితే ఈ పరిణామం వెనుక రాజకీయ నాయకులు, దళారులు, అధికారుల ప్రమేయం ఉందన్న ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. ఇవి నిర్ధారణ కాని ఆరోపణలే అయినప్పటికీ, వీటిపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది. నారాయణఖేడ్‌లో గత పదేళ్లుగా ఫామ్‌ల్యాండ్ వ్యాపారం విస్తరించిందని, ఎకరం భూమి ధరలు గతంతో పోలిస్తే అనేక రెట్లు పెరిగాయని స్థానిక వర్గాలు పేర్కొంటున్నాయి. ఆదివారాల్లో ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలుదారులను తీసుకొచ్చి ఆకర్షణీయమైన హామీలతో భూములు విక్రయిస్తున్నారని, కొన్ని వెంచర్లకు అవసరమైన అనుమతులపై సందేహాలు ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యవసాయ భూములను ఫామ్‌ల్యాండ్ పేరుతో విక్రయించే సమయంలో భూవినియోగ నిబంధనలు, యాజమాన్య హక్కులు, అవసరమైన అనుమతులు పాటిస్తున్నారా లేదా అనేది సంబంధిత అధికారులు పరిశీలించాలి. లేకపోతే పెట్టుబడులు పెట్టిన సామాన్యులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ వ్యవహారంలో రాజకీయంగా ఆసక్తికరమైన అంశం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల స్థానిక నాయకులపై వస్తున్న ఆరోపణలు. అధికారంలో ఉన్నవారికి ఎకరాల చొప్పున డబ్బులు చెల్లించాల్సి వస్తోందని, ప్రతిపక్ష నాయకులకూ వాటాలు ఇవ్వాలనే ఒత్తిళ్లు ఉన్నాయని కొందరు వ్యాపారులు ఆరోపిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. డబ్బులు ఇవ్వకపోతే రిజిస్ట్రేషన్లకు ఆటంకాలు సృష్టి స్తారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక ఆధారాలు, విచారణ నివేదికలు వెలువడే వరకు ఎవరినీ దోషులుగా నిర్ధారించడం సరికాదు. ఆరోపణలు నిజమైతే మాత్రం పార్టీతో సంబంధం లేకుండా బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. 2018 తర్వాత రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు పెరిగిన సమయంలో అప్పటి అధికార బీఆర్ఎస్ నాయకులకు ప్రయోజనాలు కలిగాయన్న ఆరోపణలతో పాటు, అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ నాయకులపైనా వసూళ్ల ఆరోపణలు ఉన్నాయి. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఇలాంటి వ్యవహారాలు కొనసాగుతున్నాయన్న ప్రచారం రాజకీయ వివాదాన్ని మరింత పెంచుతోంది. ఈ నేపథ్యంలో గత పదేళ్లలో అనుమతులు పొందిన వెంచర్లు, భూముల రిజిస్ట్రేషన్లు, నిలిపివేసిన లావాదేవీలు, వచ్చిన ఫిర్యాదులపై సమగ్ర పరిశీలన అవసరం. ఆరోపణలు రాజకీయ కక్షసాధింపులో భాగమా, లేక వాస్తవమైన అక్రమాలున్నాయా అన్నది ఆధారాల ద్వారానే తేలాలి. రెవెన్యూ శాఖ పారదర్శకత ఈ వివాదంలో కీలక పాత్ర పోషిస్తుంది. భూసేకరణ, భూవినియోగ మార్పులు, రిజిస్ట్రేషన్ల ప్రక్రియలు నిబంధనల ప్రకారం సాగుతున్నాయా లేదా అన్నది ఉన్నతాధికారులు పర్యవేక్షించాలి. అక్రమ వసూళ్లపై ఫిర్యాదులు వస్తే నిష్పక్షపాతంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో కొనుగోలుదారులు కూడా భూమి పత్రాలు, అనుమతులు, యాజమాన్య హక్కులను పరిశీలించిన తర్వాతే పెట్టుబడులు పెట్టాలి. మొత్తంగా నారాయణఖేడ్ ఫామ్‌ల్యాండ్ వ్యవహారం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు రాజకీయంగానే కాకుండా జవాబుదారీతనం పరంగానూ పరీక్షగా నిలుస్తోంది. ఆరోపణలకు రాజకీయ రంగు పులమడం కంటే వాస్తవాలను వెలికితీయడం ముఖ్యం. ప్రభుత్వం విచారణకు సిద్ధమై పారదర్శకతను నిరూపించుకోవాలి. ప్రతిపక్షాలు కూడా ఆధారాలతో ప్రశ్నించాలి. భూముల వ్యాపారం చట్టబద్ధంగా సాగడం, రైతులు, కొనుగోలుదారుల ప్రయోజనాలు కాపాడటం, ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజలకు నమ్మకం కల్పించడం పాలకుల బాధ్యత. రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజల ఆస్తి హక్కులు, చట్టబద్ధమైన పాలనకే ప్రాధాన్యం దక్కాలి.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539
flashindia999@gmail.com

# తాగునీటి గండం తప్పదా?

## రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఢమాల్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఎల్‌నినో ప్రభావం.. వర్షాలు లేకపోవడం.. ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహాలు రాకపోవడంతో రాష్ట్రంలో సాగునీటికే కాదు.. తాగునీటికీ కష్టాలు వచ్చే ప్రమాదాలు కనిపిస్తున్నాయి. మొన్నటి వరకు జలకళతో కనిపించిన కొన్ని రిజర్వాయర్లలో ఇప్పుడు నిల్వలు ప్రమాదకర స్థాయికి దిగజారాయి. ముఖ్యంగా సింగూరు, నిజాంసాగర్, శ్రీరాంసాగర్, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, ఇన్‌ఫ్లో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయి. మరోవైపు కాల్వలు, విద్యుత్ ఉత్పత్తి అవసరాలకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో సాగునీటి అవసరాలు, ప్రాజెక్టుల నిర్వహణపై ఆందోళనకర పరిస్థితి నెలకొన్నది.

**ప్రాజెక్టులకు నిలిచిన ఇన్‌ఫ్లో**

గోదావరి బేసిన్‌లోని సింగూరు ప్రాజెక్టులో 29.91టీఎంసీల పూర్తి నిల్వ సామర్థ్యానికిగాను 3.79 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నది. అంటే ప్రాజెక్టులో సుమారు 12.7 శాతం నిల్వ మాత్రమే మిగిలింది. 24 గంటల్లో ఈ ప్రాజెక్టుకు కొత్తగా నీరు చేరలేదు. నిజాంసాగర్‌లో 17.80 టీఎంసీల సామర్థ్యానికి గాను 10.58 టీఎంసీల నిల్వ ఉంది. ఇక్కడ కూడా 24 గంటల్లో ఇన్‌ఫ్లో నమోదుకాలేదు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 80.50 టీఎంసీలకు గాను 44.94 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 24 గంటల్లో కొత్తగా నీరు చేరలేదు. మిడ్ మానేరు రిజర్వాయర్‌లో 27.55 టీఎంసీల సామర్థ్యానికి గాను 23.49 టీఎంసీలు, లోయర్ మానేరు డ్యామ్‌లో 24.03 టీఎంసీలకు గాను 15.55 టీఎంసీల నీరు ఉంది. ఈ రెండు ప్రాజెక్టులకూ 24 గంటల్లో ఇన్‌ఫ్లో లేదు. ఎగువ నుంచి నీటి రాక తగ్గిన నేపథ్యంలో ప్రస్తుత నిల్వలను జాగ్రత్తగా వినియోగించాల్సిన అవసరం ఏర్పడింది.

**కృష్ణా బేసిన్‌లోనూ అదే దుస్థితి..**

కృష్ణా బేసిన్‌లోని శ్రీశైలం ప్రాజెక్టులో 215.81 టీఎంసీల పూర్తి నిల్వ సామర్థ్యానికి గాను 69.01 టీఎంసీల నీరు ఉంది. 24 గంటల్లో 383 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో నమోదైంది. నాగార్జునసాగర్‌లో 312.05 టీఎంసీల సామర్థ్యానికిగాను 188.95 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల్లో 14,371 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. పులిచింతల ప్రాజెక్టులో 175 టీఎంసీల సామర్థ్యానికి గాను 29 టీఎంసీల నీరు ఉంది. అయితే.. 24 గంటల్లో 400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే నమోదైంది. జూరాల ప్రాజెక్టులో 9.66 టీఎంసీల సామర్థ్యానికిగాను 7.37 టీఎంసీలు, తుంగభద్రలో 105.79 టీఎంసీలకుగాను 62.10 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూరాలకు 24 గంటల్లో ఇన్‌ఫ్లో లేకపోగా, తుంగభద్రకు కూడా కొత్తగా నీరు చేరలేదు.ప్రాజెక్టుల్లోకి నీరు చేరే అవకాశం తగ్గినప్పటికీ, అవసరాల మేరకు నీటిని బయటకు విడుదల చేయాల్సి వస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తికి 14,441 క్యూసెక్కులు, కాల్వలకు 4,968 క్యూసెక్కులు విడుదలవుతున్నాయి. నాగార్జునసాగర్ నుంచి విద్యుత్ ఉత్పత్తికి 4,823 క్యూసెక్కులు, కాల్వలకు 2,100 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీరాంసాగర్ నుంచి విద్యుత్ ఉత్పత్తికి 4,317 క్యూసెక్కులు, కాల్వలకు 1,224 క్యూసెక్కులు విడుదలవుతున్నట్టు నివేదికలో పేర్కొన్నారు. నిజాంసాగర్ నుంచి ఇతర అవసరాలకు 180 క్యూసెక్కులు, సింగూరు నుంచి కాల్వలకు 292 క్యూసెక్కులు, ఇతర అవసరాలకు 60 క్యూసెక్కులు విడుదలవుతున్నాయి. ఇప్పటికే నిల్వలు పరిమితంగా ఉన్న ప్రాజెక్టుల్లో నీటి రాక తగ్గిన సమయంలో విడుదలలపై సమతుల్యత పాటించడం కీలకంగా మారింది.

**నీటి వినియోగంపై అప్రమత్తత**

రానున్న రోజుల్లో వర్షాలు కురుస్తాయా ? ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులకు మళ్లీ వరద ప్రవాహాలు వస్తాయా? అనే అంశాలు నీటి నిల్వల పరిస్థితిని ప్రభావితం చేయనున్నాయి. ప్రాజెక్టుల్లో మిగిలిన నీటిని తాగునీరు, సాగునీరు, విద్యుత్ ఉత్పత్తి అవసరాలకు ఎలా వినియోగించాలన్నది అధికారులకు సవాలుగా మారనుంది. నీటి లభ్యత తక్కువగా ఉన్న రిజర్వాయర్లలో నిల్వలను పర్యవేక్షిస్తూ, అవసరాలకు అనుగుణంగా విడుదలను సమన్వయం చేయాల్సిన అవసరం ఉంది. మొత్తంగా రిజర్వాయర్లలో నీటి నిల్వలు తక్కువగా ఉండటం, పలుచోట్ల ఇన్‌ఫ్లో నిలిచిపోవడం ఆందోళన కలిగిస్తున్నాయి. వర్షాలు కురవకపోతే ఈ పరిస్థితి మరింత ప్రభావం చూపే అవకాశముండటంతో ప్రాజెక్టుల నీటి లభ్యతపై రానున్న రోజుల్లోనూ భయంకర పరిస్థితులే కనిపిస్తున్నాయి. దాంతో సాగునీటి అందించడం మాట పక్కన పెడితే అసలు తాగునీటి గండం నుంచి ఎలా బయటపడడం అనేది ప్రభుత్వానికి పెద్ద టాస్క్‌లా మారింది.



## నో అపాయింట్మెంట్

**ఢిల్లీ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వివాదం, ఎన్నికల సంఘం తీరు పై విపక్షాలు పోరాటానికి సిద్ధమవుతున్న వేళ సీజేఐ ఊహించని షాక్ ఇచ్చారు. ఈ అంశాలపై చర్చించేందుకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అపాయింట్‌మెంట్ కోరుతూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సమర్పించిన వినతిని సీజేఐ కార్యాలయం తిరస్కరించింది. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, 'ఓట్ల చోరీ ని అరికట్టాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌ను కలిసి దేశ ప్రజల తరఫున వినతిపత్రం (మెమోరాండం) సమర్పిస్తామని రాహుల్ గాంధీ సహా ఇండియా కూటమి అగ్రనేతలు ఆదివారం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ భేటీకి అవకాశం ఇవ్వలేమని సీజేఐ సూర్యకాంత్ స్పష్టం చేస్తూ, అందుకు గల కారణాలను వివరిస్తూ లిఖితపూర్వకంగా సమాధానం పంపినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.సోమవారం నాడు ఢిల్లీలో విపక్ష నేతలు, పౌర సమాజం, యువతతో కలిసి సుప్రీంకోర్టు వరకు భారీ శాంతియుత ర్యాలీ నిర్వహించి సీజేఐ కి మెమోరాండం ఇవ్వాలని ఇండియా కూటమి వ్యూహరచన చేసింది. కానీ, న్యాయపరమైన పరిధిలో పరిశీలించాల్సిన అంశాలు, కోర్టు పరిధిలోకి వచ్చే వ్యవహారాలపై రాజకీయ పక్షాల ప్రతినిధి బృందాలతో ఇలాంటి ప్రత్యేక వ్యక్తిగత భేటీలు సాధ్యం కాదన్న సంకేతాన్ని సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చినట్లయింది. సీజేఐ అపాయింట్‌మెంట్ నిరాకరించడంతో ప్రతిపక్ష కూటమి తలపెట్టిన సుప్రీంకోర్టు మార్చ్‌పై ఎలాంటి ప్రభావం పడుతుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ పరిణామంతో కేంద్ర ఎన్నికల సంఘం వివాదం, ఢిల్లీ నిరసనల రాజకీయం మరింత ఉత్కంఠభరిత మలుపు తిరిగింది.

# వేగంగా.. క్షేమంగా..!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బండి వేగం అందుకునేలోగా పడిపోయే ట్రాఫిక్ సిగ్నళ్లు.. రహదారులను మించిన కూడళ్లు.. ఆగుతూ.. సాగుతూ.. వాహనదారులకు నిత్యం నరకం కనిపించే కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రయాణం.. ఒక్క ఆలోచనతో మారిపోయింది.. ప్రయోగాత్మకంగా పరిశీలించిన వన్ వే విధానం విజయవంతమైంది. దాంతో దానిని శాశ్వతంగా మార్చివేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పుడు కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రయాణం సజావుగా సాగుతోంది. అయితే, ఇందులోనూ చిన్న, చిన్న సమస్యలున్నాయి. వాటన్నింటిని పరిష్కరించి మరింత వేగంగా, క్షేమంగా ట్రాఫిక్ సాగేందుకు జీహెచ్ఎంసీ పనులు చేపడుతోంది. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా మార్చాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పంతో నగరంలో వివిధ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ క్రమంలోనే కేబీఆర్ పార్క్ పనులను చేపట్టారు. కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న జంక్షన్లు ఎత్తుపల్లాలుగా, కొన్ని చోట్ల పెద్దవిగా, మరికొన్ని చోట్ల చిన్నవిగా ఉన్నాయి.అలాగే ఇతర ప్రాంతాలకు మళ్లే మార్గాలు సక్రమంగా లేవు. ఈ నేపథ్యంలో వాటిని సరైన విధంగా మార్పులు చేస్తున్నారు. ప్రధానంగా అగ్రసేన్ జంక్షన్‌తో పాటు కీలకమైన రోటరీ ఐలాండ్‌ల వద్ద పెద్ద ఎత్తున మార్పులు చేస్తున్నారు. వన్-వే ట్రాఫిక్ సజావుగా సాగడానికి, వాహనాలు సురక్షితంగా ఒక లేన్ నుంచి మరో లేన్‌కు మారడానికి వీలుగా ఫిల్మ్ నగర్ జంక్షన్, రోడ్ నెంబర్ 45 జంక్షన్ల వద్ద ట్రాఫిక్ చానలైజేషన్ ఐలాండ్‌లను (ట్రాఫిక్ విభజన దిమ్మెలు) ఏర్పాటు చేస్తున్నారు. కేబీఆర్ పార్క్ సమీపంలోకి చేరిన వాహనాలు ఎక్కడా ఆగకుండా వెళ్లడంతో పాటు ఎటువంటి ఆటంకం లేకుండా ఎడమ వైపునకు మళ్లేందుకు, అలాగే ముందుకు సాగేందుకు వీలుగా శాశ్వత వన్-వే విధానానికి అనుగుణంగా అన్ని జంక్షన్ ఐలాండ్‌లను పునఃనిర్మిస్తున్నారు. ముఫఖం జా కాలేజ్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్టు వరకు 4.3 కిలోమీటర్ల దూరం 6-వరుసల ఎలివేటెడ్ కారిడార్ పనులు జోరుగా సాగుతున్నాయి.

**రోడ్ నెంబర్ 45 విస్తరణ:**

బంజారాహిల్స్ / జూబ్లీహిల్స్ నుంచి కేబుల్ బ్రిడ్జ్, దుర్గం చెరువు, నాలెడ్జ్ సిటీ (హైటెక్ సిటీ) వైపు వెళ్లే భారీ రద్దీని నివారించాలంటే సినీ నటుడు బాలకృష్ణ ఇంటి ముందున్న రోడ్ నెంబర్ 45 జంక్షన్‌ను బాగా విస్తరించాల్సి ఉంది. ఇందుకోసం అధికారులు బాలకృష్ణను సంప్రదించగా తాను ఉంటున్న ఇంటి స్థలంలో సుమారు 862.77 చదరపు గజాలు ఇచ్చేందుకు ఆయన అంగీకరించారు. ఈ జంక్షన్‌ను విస్తరిస్తే టెక్ పార్కుల వైపు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ జామ్ కాదు. ప్రస్తుత పనులతో బాలకృష్ణ ఇంటిలోని ఓ భవనం సగానికి పైగా పోతోంది. ఆయన సైతం ఇక్కడి నుంచి మారాల్సి వస్తుంది. అయినా పరిహారం తీసుకోకుండానే స్థలం ఇచ్చివేశారు. టీడీఆర్ తీసుకునేందుకు అంగీకరించారు.

**భారీ ట్రాఫిక్‌కు చెక్:**

కేబీఆర్ ఎంట్రన్స్ జంక్షన్ వద్ద శబ్దాలయా స్టూడియో ఉంది. ఈ జంక్షన్ వన్-వేకు ఎంట్రన్స్‌గా ఉంది. పంజాగుట్ట, ఎన్ఎఫ్‌సిఎల్ (ఎన్ఎఫ్‌సీఎల్) నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ (జెహెచ్‌సీపీ) వైపు వచ్చే భారీ ట్రాఫిక్‌ను ఇది నియంత్రిస్తుంది. ఈ జంక్షన్ వద్ద ఎటువంటి ఆటంకం లేకుండా ఫ్రీ లెఫ్ట్-టర్న్ సాగేందుకు, ఇతర మార్గాల్లోకి మళ్లే వాహనాలు ట్రాఫిక్ జామ్‌లలో చిక్కుకోకుండా సజావుగా సాగిపోవడానికి ఇక్కడ విస్తరణ అవసరం ఉంది. ఇందుకు శబ్దాలయా స్టూడియోకు చెందిన సుమారు 608 చదరపు గజాలు స్థలం అవసరమైంది. ఆ మొత్తాన్ని పరిహారం తీసుకోకుండా టీడీఆర్‌తోనే శబ్దాలయా యాజమాన్యం ఇచ్చింది. ఈ పనులతో శబ్దాలయా స్టూడియో ప్రహరీతో పూర్తిగా పోవడంతో పాటు ప్రధాన భవనం వరకు పనులు సాగుతున్నాయి.

**జంక్షన్ల అనుసంధానం:**

జూబ్లీహిల్స్ లోపలి కాలనీలను ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి, పశ్చిమ ఐటీ కారిడార్‌తో ఫిల్మ్ నగర్ జంక్షన్ అనుసంధానిస్తుంది. ఈ జంక్షన్ వద్ద రోడ్డు మార్పులతో వాహనాల లేన్ మార్పుల కు ఎటువంటి ఆటంకాలు ఉండవు. దీంతో బ్యాంకింగ్, టెక్ హబ్‌ల వైపు వెళ్లే కార్పొరేట్ రవాణా వాహనాలు, ప్రైవేటు వాహనాలు ఎక్కడా ఆగకుండా నిరంతరాయంగా వెళ్లడానికి వీలవుతుంది. ఇక్కడ పనుల కోసం భవ్య కన్‌స్ట్రక్షన్స్‌కు సమారు 341.33 చదరపు గజాలు స్థలాన్ని పరిహారం తీసుకోకుండా టీడీఆర్‌తో అప్పగించింది. ఈ పనుల్లో భవ్య కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన భవనం పూర్తిగా పోతోంది.

# గత ఒప్పందాల అమలుపై రచ్చ!

**మహబూబ్ నగర్,ఫ్లాష్ ఇండియా :** అధికార కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల పంపకం చినికి చినికి గాలివానలా మారుతోంది. జిల్లా స్థాయి కీలక పదవులైన మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా), జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ల పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుండటంతో కొత్త పీఠాలపై పంచాయితీ మొదలైంది. గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం ఈ దఫా తమ నియోజకవర్గాలకే అవకాశం దక్కాలని ఎమ్మెల్యేలు ఎవరికి వారు పట్టుబడుతుండటంతో అధిష్ఠానానికి తలనొప్పిగా మారింది. ముఖ్యంగా అభివృద్ధి, నిధుల పరంగా అత్యంత కీలకమైన 'ముడా' చైర్మన్ పదవి కోసం దేవరకద్ర, జడ్చర్ల ఎమ్మెల్యేలు జి.మధుసూదన్ రెడ్డి, అనిరుధ్ రెడ్డిల మధ్య మొదలైన అంతర్గత పోరు జిల్లా కాంగ్రెస్‌లో రాజకీయ వేడిని రాజేస్తోంది.

**తొలి విడత పాలమూరుకే.. ఇప్పుడు మాకేదీ?**

ప్రభుత్వం కొలువుదీరిన తొలినాళ్లలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి (జీఎంఆర్), జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డిల మధ్య ఒక అవగాహన కుదిరింది. ఆ ఏకాభిప్రాయంతోనే తొలుత రెండు జిల్లా స్థాయి పదవులను మహబూబ్‌నగర్ నియోజకవర్గానికే కేటాయించారు. దీంతో ముడా చైర్మన్‌గా లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మల్లు నరసింహారెడ్డి బాధ్యతలు చేపట్టారు. అయితే, ఆ సమయంలో కుదిరిన అంతర్గత ఒప్పందం ప్రకారం.. మొదటి విడత గడువు ముగియగానే తర్వాతి విడతలో ఆ రెండు పదవులను జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాలకు వదిలేయాల్సి ఉంది. ప్రస్తుతం లక్ష్మణ్ యాదవ్ పదవీకాలం ఈనెల 18తో ముగియనుండటంతో, కొత్త నియామకాల వేళ ఆ ఒప్పందం తెరపైకి వచ్చింది.

**మాట నిలబెట్టుకునేందుకు 'జీఎంఆర్' ఆరాటం..**

మునిసిపల్ ఎన్నికల ప్రచార సమయంలో భూత్పూర్ మునిసిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్ గౌడ్‌కు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి బహిరంగ హామీ ఇచ్చారు. ముడా చైర్మన్ పదవి ఖాళీ కాగానే ఆ స్థానాన్ని ఆయనకే కేటాయిస్తానని పార్టీ శ్రేణుల సమక్షంలో ప్రకటించారు. లక్ష్మణ్ యాదవ్ పదవీకాలం ముగుస్తుండటంతో ఇచ్చిన మాట ప్రకారం నవీన్ గౌడ్‌కు ఆ కుర్చీ కట్టబెట్టేందుకు ఎమ్మెల్యే జీఎంఆర్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అధిష్ఠానం వద్ద సైతం తన పంతం నెగ్గించుకునేలా పావులు కదుపుతున్నారు.

**మా నిధులు మాకేవి?.. తగ్గేదేలే అంటున్న అనిరుధ్‌రెడ్డి**

మరోవైపు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాత్రం ముడా పీఠం తమ నియోజకవర్గానికే దక్కాలని గట్టి పట్టుబడుతున్నారు. ముడాకు వచ్చే ఆదాయంలో సింహభాగం జడ్చర్ల నుంచే సమకూరుతున్నప్పటికీ, అందుకు తగ్గట్లుగా తమ ప్రాంతానికి అభివృద్ధి నిధులు అందడం లేదని వాదిస్తున్నారు. పైగా, గతంలోనే ముడా చైర్మన్ పదవిని రెండో విడతలో జడ్చర్లకు ఇస్తామని ఇద్దరు ఎమ్మెల్యేలు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. తమ అభిప్రాయాలను, నియోజకవర్గ ప్రయోజనాలను కాదని నియామకాలు చేపడితే ఏమాత్రం సహించే ప్రసక్తే లేదని అధిష్ఠానానికి ఇప్పటికే తేల్చిచెప్పినట్లు సమాచారం.

**అవకాశం ఎవరికి వరిస్తుందో..**

ఈ నేపథ్యంలో ఈ పదవిని తమ అనుచరులకు కట్ట పెట్టేందుకు ఇరువురు ఎమ్మెల్యేలు దూడ నిశ్చయంతో ఉన్నట్లు తెలుస్తోంది. అవకాశం ఎవరిని వరిస్తుందో అని రకరకాలుగా ప్రచారం జరుగుతోంది. ముడా చైర్మన్ పదవి జడ్చర్లకు దక్కితే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి దేవరకద్ర నియోజకవర్గానికి దక్కే అవకాశాలు ఉన్నాయి. వీటితోపాటు జిల్లాలో మార్కెట్ కమిటీల పదవీకాలం దగ్గర పడుతున్న నేపథ్యంలో ఆ పదవుల విషయంలోనూ పలువురు ఆశావహులు ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

**ఎమ్మెల్యేల ముందు చూపు..**

వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసేందుకు వ్యూహరచనలు చేస్తూ అడుగులు ముందుకు వేస్తున్నారు. ఓటు బ్యాంకు, పార్టీకి చేసిన సేవలు, తదితర అంశాలను గుర్తించి పదవులు ఇస్తాము అని ఎమ్మెల్యేలు చెబుతున్న... బలమైన సామాజిక నేపథ్యం, పనితీరు బాగున్న వాళ్లకే అవకాశం కల్పించాలి అన్న యోచనలో ఎమ్మెల్యేలు ఉన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవుల సంగతి అటు ఉంచితే.. లైబ్రరీ, ముడా చైర్మన్ పదవులకు అర్హులను ఎంపిక చేయడం ఎమ్మెల్యేలకు కత్తి మీద సామే అని చెప్పాలి.



## రూ.4 లక్షలకే ఫ్లాట్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగరంలో ఇందిరమ్మ టవర్లకు వస్తున్న విశేష స్పందనను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కూడా వీటిని నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా అన్ని ఉమ్మడి జిల్లాల్లో విడతల వారీగా ఈ భవనాలను ఏర్పాటు చేయనున్నారు. తొలి విడత కింద నిజామాబాద్, వరంగల్ ప్రాంతాల్లో వీటిని నిర్మించేందుకు హౌసింగ్ బోర్డు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే ఆయా ప్రాంతాల్లోని స్థలాలను పరిశీలించడంతో పాటు డీపీఆర్ రూపకల్పన వేగంగా జరుగుతోంది.నగరంలో ఒక్కో ఫ్లాట్ నిర్మాణానికి సుమారు రూ.11 లక్షల వరకు బడ్జెట్ అంచనా ఉండగా.. జిల్లాల్లో మాత్రం నిర్మాణ ఖర్చు కొంత తక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. జిల్లాల్లో ప్రతి ఫ్లాట్‌కు సుమారు రూ.8 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు ఖర్చు కానుందని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ అందించే ఇందిరమ్మ ఇళ్ల సబ్సిడీ పోను, లబ్ధిదారులు కేవలం రూ.4 లక్షలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.ప్రభుత్వ, హౌసింగ్ బోర్డుకు చెందిన ఖాళీ స్థలాలనే ఈ టవర్ల నిర్మాణం కోసం పూర్తిగా వినియోగిస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్ పరిధిలోని పలు నియోజకవర్గాల్లో ఈ ప్రాజెక్టుల పనులు ప్రారంభం కాగా.. ఇప్పుడు జిల్లాల్లో కూడా అమలు చేయనుండటంతో పేద మధ్యతరగతి ప్రజల సొంతింటి కల మరింత సులభంగా నెరవేరనుంది. అర్హులైన పేదలందరికీ పారదర్శక పద్ధతిలో ఈ ఫ్లాట్లను కేటాయించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది.



# రూ.10కోట్ల ధాన్యం మాయం!

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వం పేద ప్రజల ఆకలి తీర్చేందుకు సేకరించిన ధాన్యంపై మిల్లర్ల కన్ను పడింది. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ముసుగులో కొందరు రైస్ మిల్లర్లు యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతూ కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనాన్ని దిగమింగుతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లావ్యాప్తంగా సుమారు 140 మిల్లుల్లో సీఎంఆర్ బియ్యం అప్పగింత పెండింగ్‌లో ఉండగా, పలువురు మిల్లర్లు ఏకంగా ప్రభుత్వ ధాన్యాన్నే బహిరంగ మార్కెట్లో అమ్ముకుని సొమ్ము చేసుకున్న వైనం విజిలెన్స్ తనిఖీల్లో వెలుగుచూసింది. మిర్యాలగూడ మండలంలోని కిష్టాపురం శివారులోని లలిత రైస్ మిల్లు యాజమాన్యం ఏకంగా రూ.9.79కోట్ల విలువైన ధాన్యాన్ని స్వాహా చేసినట్లు అధికారులు నిర్ధారించారు. ఈ భారీ కుంభకోణంపై సివిల్ సప్లై అధికారులు క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులకు సిఫారసు చేసినప్పటికీ నిందితుడిని అరెస్ట్ చేయకుండా పోలీసులు కాలయాపన చేస్తుండడంపై సర్వత్రా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**రూ.10కోట్ల ప్రజాధనం స్వాహా...**

మిల్లర్లు తమ పలుకుబడిని అడ్డుపెట్టుకుని పేదల బియ్యాన్ని దారిమళ్లించిన తీరుపై విజిలెన్స్ అధికారులు లోతైన దర్యాప్తు చేపట్టారు. కిష్టాపురం సమీపంలోని లలిత రైస్ మిల్లుపై ఇటీవల దాడులు నిర్వహించగా, రికార్డులకు మిల్లులోని నిల్వలకు మధ్య భారీ వ్యత్యాసాలు బయటపడ్డాయి. 2022-23 సీజన్‌లో రూ.2.08కోట్లకు గాను ఇంకా రూ.69లక్షల బకాయి పెండింగ్‌లో ఉంది. 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి 2,457 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి చేసుకోగా నిబంధనల ప్రకారం 1,647 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. కానీ కేవలం 1,291 మెట్రిక్ టన్నులే ఇవ్వడంతో రూ.2.08కోట్ల విలువైన ధాన్యం బకాయి పడింది. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో 1,072 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తీసుకుని, కేవలం 220 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ప్రభుత్వానికి ఇచ్చారు. ఇందుకుగాను రూ.4.68కోట్లు, రబీకి సంబంధించిన మరో రూ.2కోట్లు కలిపి సదరు మిల్లరు మొత్తం రూ.9.79కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా దారిమళ్లించి అమ్ముకున్నట్లు అధికారులు నిర్ధారించారు.

**పోలీసుల అలసత్వం.. మిల్లర్ల పైరవీల జోరు...**

ప్రజాధనాన్ని కొల్లగొట్టిన లలిత రైస్ మిల్లు యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సివిల్ సప్లై అధికారులు పోలీసు శాఖకు అధికారికంగా సిఫారసు చేశారు. అయితే పోలీసులు మాత్రం ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేయడంలో తాత్సారం చేస్తున్నారు. ఈ వెసులుబాటును ఆసరాగా చేసుకున్న సదరు మిల్లరు తప్పించుకునేందుకు రాజకీయ నాయకులతో ముమ్మరంగా పైరవీలు నడుపుతున్నట్లు సమాచారం. ఈ మిల్లుతోపాటు అక్రమాలకు పాల్పడిన మరో రెండు మిల్లులపై సైతం అధికారులు క్రిమినల్ కేసులకు సిఫారసు చేశారు.

# ఉమ్రా యాత్రలో విషాదం..

**సౌదీ అరేబియా :** ఉమ్రా యాత్ర హైదరాబాదీ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యులతో కలిసి ఐటీ ఉద్యోగి మహమ్మద్ యూసుఫ్ (46) సౌదీ అరేబియాలో ఉమ్రా యాత్రకు వెళ్లాడు. అక్టోబర్ 10న రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బాంబు దాడి జరిగింది. ఈ దాడిలో 13 మంది చనిపోగా.. ఇందులో హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ యూసుఫ్ ప్రాణాలు కోల్పోగా.. భార్య, పిల్లలకు గాయాలయ్యాయి. పవిత్ర యాత్రకు వెళ్లి యూసుఫ్ ప్రాణాలు కోల్పోవడంతో హైదరాబాద్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరు అవుతున్నారు.మహమ్మద్ యూసుఫ్ సౌదీ అరేబియాలో ఐటీ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఉమ్రా యాత్రలో భాగంగా ఆయన తన భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి ప్రయాణిస్తున్నాడు. రియాద్ విమానాశ్రయంలో మదీనాకు వెళ్లే విమానం కోసం కుటుంబ సభ్యులతో కలిసి ఎదురుచూస్తున్న సమయంలో ఒక్కసారిగా బాంబు దాడి జరిగింది. ఈ సమయంలో దాడి కారణంగా పడిన శిథిలాలు కుటుంబ సభ్యులకు తగిలాయని.. దీంతో యూసుఫ్ ప్రాణాలు కోల్పోగా.. ఆయన భార్య, పిల్లలు, ఇతర బంధువులు గాయపడినట్లు సమాచారం. గాయపడిన వారికి వైద్య చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది.

**అసదుద్దీన్ ఒవైసీ విజ్ఞప్తి**

ఈ ఘటనపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. యూసుఫ్ కుటుంబ సభ్యులకు అవసరమైన వైద్య సహాయం అందించడంతో పాటు, ఆయన మృతదేహాన్ని భారత్‌కు తీసుకురావడానికి సహకరించాలని భారత విదేశాంగ శాఖను కోరారు. కుటుంబం తీవ్ర విషాదంలో ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం, భారత దౌత్య అధికారులు వెంటనే స్పందించి సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

**సాయం అందిస్తామన్న జైశంకర్**

ఈ ఘటనపై విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సంతాపం వ్యక్తం చేశారు. సౌదీ అరేబియాలోని భారత రాయబార కార్యాలయం కూడా బాధిత కుటుంబానికి అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. యూసుఫ్ కుటుంబ సభ్యులకు వైద్య చికిత్స, ఇతర అవసరాల విషయంలో సహకారం అందించేందుకు భారత అధికారులు చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది.గత కొద్దిరోజులుగా సౌదీ లక్ష్యంగా హౌతీలు దాడులు చేస్తున్నారు. విమానాశ్రయాలు టార్గెట్‌గా హౌతీలు దాడులు చేస్తున్నారు. సౌదీ సైన్యం తిప్పికొడుతున్నా.. హౌతీలు మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఇక మక్కా ఒప్పందంలో ఉన్న టర్కీ, పాకిస్థాన్ మాత్రం పట్టించుకోవడం లేదు. సౌదీకి సాయం చేసే విషయంలో అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇక కీలక సమయంలో ట్రంప్ హ్యాండిచ్చారు. దీంతో సౌదీ అయోమయంలో కొట్టిమిట్టాడుతోంది.

# కాళేశ్వరంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు

**ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు!**

**మెటల్ డిటెక్టర్, ఏడు సెల్‌ఫోన్లు, పార,కారు స్వాధీనం**



**మహాదేవపూర్, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గుప్తనిధుల కోసం అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న ఎనిమిది మందిని కాళేశ్వరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన ఆదివారం (11.10.2026) రాత్రి సుమారు 11 గంటల సమయంలో కాళేశ్వరం గ్రామంలోని మసీదు వాడాలో చోటుచేసుకుంది. కాళేశ్వరం ఎస్సై ఇష్టబోయిన సురేష్ తెలిపిన వివరాల ప్రకారం కాళేశ్వరం గ్రామానికి చెందిన మహమ్మద్ వాజిద్ ఇంట్లో అతనితో పాటు మరో ఏడుగురు కలిసి గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఒక మెటల్ డిటెక్టర్, ఏడు మొబైల్ ఫోన్లు, ఒక పార, బెలెనో కారు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

**అదుపులోకి తీసుకున్నవారి వివరాలు :**

దొడ్డ వేణుగోపాల్ (హైదరాబాద్), మూల మోహన్ (కరీంనగర్), ముడిమడుగుల శంకర్ (మంచిర్యాల), మహమ్మద్ వాజిద్, సయ్యద్ సలీం, సయ్యద్ సత్తార్, షేక్ తాజుద్దీన్ అలియాస్ బాబా (కాళేశ్వరం), ఇలియాజ్ (ఆసరెల్లి, సిరోంచ) ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ చర్యల్లో కాళేశ్వరం పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# పత్తి అధిక దిగుబడిపై రైతులకు అవగాహన

**మహబూబ్ నగర్ జిల్లా (జడ్చర్ల), ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** కాటన్ ప్రొడక్టివిటీ మిషన్ (కపాస్ క్రాంతి) పథకంలో భాగంగా అధిక సాంద్రత పత్తి సాగు చేసిన రైతు పొలంలో ఫీల్డ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి గోపినాథ్ మాట్లాడుతూ జూలైలో రైతులకు పత్తి విత్తనాలు పంపిణీ చేసి, ఎకరాకు ఆరు ప్యాకెట్ల విత్తనాలతో సాగు చేపట్టారని తెలిపారు. వరుసకు వరుసకు 90 సెంటీమీటర్లు, మొక్కకు మొక్కకు 15 సెంటీమీటర్ల దూరం పాటించే ఈ పద్ధతిలో మొక్కలు అధికంగా పెరిగి, కాయల సంఖ్య పెరగడం ద్వారా దిగుబడి పెరిగే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శంకర్, రైతులు బాలస్వామి, బంగారు శ్రీనివాసులు, రాములు, సాయన్న, చిన్న జంగయ్యతో పాటు మహిళా రైతులు పాల్గొన్నారు.

# తీదేడు రామాలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవం







**నల్లగొండ జిల్లా / చింతపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** చింతపల్లి మండలం తీదేడు (వెంకటంపేట) గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠతో పాటు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో తీదేడు మాజీ సర్పంచ్ కాయితి జితేందర్ రెడ్డి, కవిత దంపతులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న, శేఖర్ రెడ్డి దంపతులు, మాజీ వార్డు సభ్యులు సొనగంటి కృష్ణమాచారి, నాగమణి దంపతులు, సొనగంటి శివ, శ్రీలక్ష్మి దంపతులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కాయితి జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, దుర్గామాత ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు.

**ఆంజనేయస్వామి విగ్రహం బహూకరణ**

ఆలయంలో ధ్వజస్తంభం వద్ద ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి విగ్రహాన్ని సొనగంటి కృష్ణమాచారి, నాగమణి దంపతులు బహూకరించారు. ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు దాతలు అందిస్తున్న సహకారం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

**భక్తులకు మహా అన్నదాన ప్రసాద వితరణ**

ప్రతిష్ఠ కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు ముగిసిన అనంతరం రామాలయం ముందు మహా అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి తీదేడు మాజీ సర్పంచ్ కాయితి జితేందర్ రెడ్డి, కవిత దంపతులు, దొబ్బల రామచంద్ర మోహన్, రోజా దంపతులు దాతలుగా సహకరించారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

**ప్రముఖుల పాల్గొనడం**

ఈ కార్యక్రమంలో తీదేడు సర్పంచ్ ఉలుపాల స్వప్న, ఉపసర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్, మాజీ ఉపసర్పంచ్ ధరణిపతి రమణారావు, మాజీ సర్పంచ్ దాసరి శ్రీనివాస్ యాదవ్, సొనగంటి కృష్ణమాచారి, నాగమణి, పల్లగుట్ట వేణుగోపాల్, వరలక్ష్మి, పల్లగుట్ట రాములు, సత్తమ్మ, సొనగంటి గోవర్ధనాచారి, మర్ల యాదగిరి, కొరివి యాదగిరి, కొరివి రాధాకృష్ణ, కలగొని రాజశేఖర్, గొడుగు సత్తయ్య, శివర్ల శంకర్ యాదవ్, గునమోని శ్రీను, బొడ్డు ఆంజనేయులు, తిరుమని ప్రభాకర్, కాయితి కృష్ణారెడ్డి, మద్రు ప్రభాకర్ రావు, కాయితి వెంకట్ రెడ్డి, బెక్కం శ్రీను, బెక్కం సాయి, పంగ సత్తయ్య, బొడ్డు తిరుపతి, గణేష్, చింతకుంట్ల రాకేష్, సందే లక్ష్మయ్య, గంటేల నరేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్వాములు తిరుమని పాపయ్య, ఐతమోని మల్లయ్య, ఇడమోని శ్రీనివాస్ యాదవ్, ఉడుత శంకర్, శివర్ల ఆంజనేయులు, సొనగంటి కొండల్, శివర్ల రమేష్, బలాదూరి వెంకటయ్య, మునగాల అశోక్‌తో పాటు గ్రామ పెద్దలు, పుర ప్రముఖులు, దాతలు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు. ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, దుర్గామాత ప్రత్యేక పూజలు, మహా అన్నదాన కార్యక్రమాలతో తీదేడు గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

# ఓటు హక్కు కోల్పోతే స్వదేశంలోనే శరణార్థులం!




**మహబూబ్‌నగర్ జిల్లా (ఫ్లాష్ ఇండియా ప్రతినిధి):** ఓటు హక్కును కోల్పోవడమంటే స్వదేశంలోనే శరణార్థులుగా మారడమేనని ప్రోగ్రెసివ్ థింకర్స్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మహబూబ్‌నగర్‌లో భారీ ర్యాలీ, సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి టూటౌన్ పోలీస్‌స్టేషన్ మీదుగా ధర్నా చౌక్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం ప్రముఖ న్యాయవాది బెక్కం జనార్దన్ అధ్యక్షతన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ఓటు హక్కుల తొలగింపుపై ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యబద్ధమైన నిరసనలను అణచివేయడం సరికాదన్నారు. డాక్టర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడలను నిరసిస్తూ, జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం ఖలీల్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ పేరుతో ఓటు హక్కుల తొలగింపు పేదలు, బలహీన వర్గాల హక్కులకు ముప్పుగా మారుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, న్యాయవాదులు, రిటైర్డ్ ఉద్యోగులు, కార్మిక సంఘాలు, విద్యార్థి, యువజన, మైనారిటీ సంఘాల ప్రతినిధులతో పాటు సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ తదితర వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు అనీఫ్ అహ్మద్, ఏ.రాములు, శ్రీదేవి, బాలకృష్ణ, సి.వెంకటేష్, పద్మావతి, ప్రవీణ్ కుమార్, అన్వర్ పాషా, డాక్టర్ రామ్మోహన్, మౌలానా నాసర్, న్యాయవాది భాస్కర్, మోసిన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# భారీ వాహనాలతో బండారికుంట రోడ్లకు గండం!



**పెద్దపల్లి ,జిల్లా ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** పెద్దపల్లి పట్టణంలోని 19వ వార్డు బండారికుంటలో భారీ వాహనాల రాకపోకలు స్థానికులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి. అధిక లోడుతో దూసుకెళ్తున్న మొరం టిప్పర్ల కారణంగా రహదారులు ధ్వంసమవుతుండటంతో పాటు నివాస గృహాలకు సైతం ప్రమాదం పొంచి ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం మొరం టిప్పర్లను అడ్డుకుని నిరసన చేపట్టారు. భారీ వాహనాల నిరంతర రాకపోకలతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, మిషన్ భగీరథ పైపులు పగిలి తాగునీరు రోడ్లపై వృథాగా పారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. బైపాస్ మార్గం లేకపోవడంతో కాలనీలోని ఇళ్ల మధ్య నుంచే భారీ టిప్పర్లు వెళ్తున్నాయని, వాటి కంపనాలకు ఇళ్ల గోడలు దెబ్బతింటూ కూలిపోయే ప్రమాదం ఏర్పడుతోందని వాపోయారు.

**విద్యార్థుల భద్రతపై ఆందోళన**

కాలనీలోని రహదారులపై భారీ వాహనాల రాకపోకలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారాయని నిరసనకారులు పేర్కొన్నారు. సమీపంలోని ప్రైవేటు విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులు తరచూ ప్రమాదాల బారినపడుతూ గాయాలపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రహదారుల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతున్నా, భారీ వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికే ప్రాణనష్టం జరిగినట్లు, పలువురు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు కాలనీవాసులు తెలిపారు. దళిత, మైనార్టీ కుటుంబాలు నివసించే ప్రాంతంలో ఇలాంటి పరిస్థితులు నెలకొనడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

**సమస్య పరిష్కరించే వరకు పోరాటం**

ప్రజల నివాసాలు, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని భారీ వాహనాల రాకపోకలపై నియంత్రణ విధించాలని, దెబ్బతిన్న రహదారులను మరమ్మతు చేయాలని, పగిలిన మిషన్ భగీరథ పైపులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. జిల్లా యంత్రాంగం, సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రజల సమస్యలను పట్టించుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బొంకూరి నవీన్, సుద్దాల శ్రీకాంత్, కనకం సాయి, సుద్దాల శ్రీధర్, నల్లాల తేజ, బొంకూరి అజయ్, ముల్కల వేణు, 19వ వార్డు ఏఐఎఫ్‌బీ పార్టీ ఇన్‌చార్జ్ ఎండీ షఫీ, గౌస్, నవాబ్, రియాజ్, బొంకూరి భూలక్ష్మి, మొలకల హారిక, కుక్క మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆదాయానికి వ్యాపారుల గండి



**మహబూబ్ నగర్ జిల్లా (జడ్చర్ల), ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జడ్చర్ల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న టీజీఎన్‌జీవో వాణిజ్య సముదాయాల్లో కొందరు వ్యాపారులు గత 26 ఏళ్లుగా తిష్టవేసి, ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య ఆరోపించారు. ఈ విషయంపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం నిర్మించినప్పటి నుంచి అక్కడి వాణిజ్య సముదాయాల్లో నాలుగు దుకాణాలు కొనసాగుతున్నాయని, వాటిలో రెండు మీ సేవ కేంద్రాలు, ఒక మెడికల్ షాప్, మరొకటి ప్రైవేట్ ఆసుపత్రి నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఆయా దుకాణాలకు ఎంత అద్దె వసూలు చేస్తున్నారో, ప్రభుత్వానికి ఎంత ఆదాయం సమకూరుతోందో స్పష్టత లేదని విమర్శించారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. బహిరంగ మార్కెట్‌లో వాణిజ్య సముదాయాలకు నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు అద్దె ఉంటుండగా, ప్రభుత్వ సముదాయాల్లో మాత్రం నామమాత్రపు అద్దెలతో వ్యాపారాలు నిర్వహిస్తున్నారని సత్తయ్య పేర్కొన్నారు. ఇదే సమయంలో సంబంధిత వ్యాపారులకు సొంత వాణిజ్య సముదాయాలు ఉండి, వాటిలో లక్షల రూపాయల అడ్వాన్స్‌తో పాటు అధిక అద్దెలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ స్థలాల్లో కొనసాగుతున్న దుకాణాలను తక్షణమే ఖాళీ చేయించి, పారదర్శకంగా బహిరంగ వేలం నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. తద్వారా ప్రభుత్వానికి న్యాయమైన ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా రిజిస్ట్రేషన్ల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని, కూర్చోవడానికి కుర్చీలు, తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయాలని తెలుగు సత్తయ్య అధికారులను కోరారు.

# లేఖ రాసి ఇంటి నుంచి వెళ్లిన యువకుడు..



**ఇబ్రహీంపట్నం,ఫ్లాష్ ఇండియా :** లేఖ రాసి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట్‌లో కలకలం రేపింది. గ్రామానికి చెందిన వరికుప్పల కుమార్ (30) ఈ నెల 11వ తేదీ తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లిపోగా, అప్పటి నుంచి అతని ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళనకు గురైన భార్య వరికుప్పల విజయ పోలీసులను ఆశ్రయించారు.

**లేఖ రాసి.. పల్సర్‌పై పరార్..**

పోలీసులకు అందిన ఫిర్యాదు ప్రకారం.. కూలీగా పనిచేసే కుమార్ గత కొంతకాలంగా మద్యానికి అలవాటుపడి కుటుంబంలో తరచూ గొడవలు పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 11న ఉదయం సుమారు 5 గంటల సమయంలో లేఖ రాసి, తన పల్సర్ ద్విచక్ర వాహనం పై ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు అతని బావమరిది ఫోన్ ద్వారా సమాచారం అందించినట్లు భార్య తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై మీర్‌ఖాన్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 167/2026 కింద మిస్సింగ్ కేసు నమోదైంది. అదృశ్యమైన యువకుడి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కుమార్ ఎత్తు సుమారు 5 అడుగుల 6 అంగుళాలు. సాధారణ శరీర ఛాయ, ఓవల్ ఆకారంలో ముఖం కలిగి ఉంటాడు. చివరిసారిగా నీలం రంగు టీ-షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించాడు. అతని ఆచూకీ తెలిసినవారు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా మీర్‌ఖాన్‌పేట్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# ఎమ్మెల్యే హామీతో ఎలిగేడు మండలానికి చేరిన సాగునీరు





**పెద్దపల్లి జిల్లా,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రైతుల పంట పొలాలకు సాగునీరు అందిస్తామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఇచ్చిన హామీ మేరకు విడుదలైన సాగునీరు ఎలిగేడు మండలానికి చేరుకోవడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. సాగునీటి సరఫరాతో పంటలకు మేలు జరగనుండటంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎలిగేడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సింగిల్ విండో చైర్మన్ సామ రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు డీ-86 కాలువను సందర్శించారు. కాలువలో ప్రవహిస్తున్న సాగునీటికి పసుపు, కుంకుమ, పూలతో పూజలు నిర్వహించి, కొబ్బరికాయలు కొట్టి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. పెద్దపల్లి నియోజకవర్గ రైతుల పంటలకు సాగునీరు అందించేందుకు చొరవ తీసుకున్న ఎమ్మెల్యే విజయ రమణారావుకు కాంగ్రెస్ పార్టీ తరఫున, రైతుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రైతుల వ్యవసాయ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సాగునీటి సరఫరాకు కృషి చేయడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. వర్షాలపై ఆధారపడకుండా కాలువల ద్వారా సాగునీరు అందితే పంటలను కాపాడుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కీలక సమయంలో నీరు చేరడం రైతులకు ఊరటనిస్తుందని, సాగునీటి సరఫరా చివరి ఆయకట్టు వరకు సక్రమంగా కొనసాగాలని ఆకాంక్షించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి సాగునీరు ఎంతో కీలకమని, పంటలు ఎండిపోకుండా నీటి సరఫరాపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నాయకులు కోరారు. ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు సాగునీరు మండలానికి చేరుకోవడంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులోనూ రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సింగిల్ విండో చైర్మన్ సామ రాజేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచులు ఏలేటి వెంకటరెడ్డి, వెంకటేష్ గౌడ్, కొమురయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు భూమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# టీ20 క్రికెట్ 'గోట్'గా మనోడే!

టీ20 క్రికెట్‌లో అత్యుత్తమ ఆటగాడు ఎవరు?.. ఈ ప్రశ్నకు ఆఫ్ఘనిస్థాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ తనదైన శైలిలో సమాధానమిచ్చాడు. టీ20 ఫార్మాట్‌లో దిగ్గజాలుగా గుర్తింపు పొందిన ఎనిమిది మంది ఆటగాళ్లతో నిర్వహించిన 'This or That' ఛాలెంజ్‌లో భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి నిరాశ ఎదురైంది. హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ ఊసేలేదు. చివరకు టీ20 క్రికెట్ 'గోట్'గా టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాను రషీద్ ఖాన్ ఎంపిక చేశాడు. ఈ ఎంపికకు సంబంధించిన వివరాలు ప్రస్తుతం క్రికెట్ అభిమానుల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి. ఈఎన్‌వీఎన్-క్రిక్‌ఇన్ఫో నిర్వహించిన ఈ ఛాలెంజ్‌లో మొత్తం ఎనిమిది మంది క్రికెటర్లు పోటీపడ్డారు. రషీద్ ఖాన్, సునీల్ నరైన్, ఏబీ డివిలియర్స్, ఆండ్రీ రస్సెల్, విరాట్ కోహ్లీ, క్రిస్ గేల్, జస్ప్రీత్ బుమ్రా, కీరన్ పొలార్డ్ ఈ జాబితాలో ఉన్నారు. క్వార్టర్ ఫైనల్స్, సెమీఫైనల్స్, గ్రాండ్ ఫైనల్.. ఇలా మూడు దశల్లో పోటీ సాగింది. ప్రతి దశలో ఇద్దరు ఆటగాళ్లలో ఒకరిని రషీద్ ఖాన్ ఎంపిక చేస్తూ ముందుకు వెళ్ళాడు. చివరకు టీ20 క్రికెట్ 'గోట్'గా జస్ప్రీత్ బుమ్రా ఎంపికయ్యాడు. మొదట సునీల్ నరైన్‌తో జరిగిన పోలికలో రషీద్ ఖాన్ తనకే ఓటు వేసుకున్నాడు. టీ20ల్లో రషీద్ 550 మ్యాచ్‌ల్లో 740 వికెట్లు పడగొట్టగా.. నరైన్ 617 మ్యాచ్‌ల్లో 658 వికెట్లు తీశాడు. అనంతరం వెస్టిండీస్ విధ్వంసక ఆల్‌రౌండర్ ఆండ్రీ రస్సెల్‌తో దక్షిణాఫ్రికా మాజీ స్టార్ ఏబీ డివిలియర్స్‌ను పోల్చగా.. డివిలియర్స్‌ను ఎంపిక చేశాడు. డివిలియర్స్ 340 టీ20 మ్యాచ్‌ల్లో 9,424 పరుగులు చేయగా.. రస్సెల్ 9,933 పరుగులు బాదాడు. భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, వెస్టిండీస్ విధ్వంసక ఆటగాడు క్రిస్ గేల్ మధ్య జరిగిన పోలికలో రషీద్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా కింగ్ కోహ్లీని ఎంపిక చేశాడు. టీ20ల్లో కోహ్లీ నిలకడైన ప్రదర్శన, పరుగులు సాధించే సామర్థ్యం అతడికి ఈ ఎంపికలో ముందంజలో ఉంచింది. అయితే కోహ్లీ ప్రయాణం సెమీఫైనల్స్‌లోనే ముగిసింది. మరోవైపు భారత పేసర్ జస్ప్రీత్ బుమ్రా, వెస్టిండీస్ ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్ మధ్య జరిగిన పోటీలో మనోడికే రషీద్ ఖాన్ ఓటు వేశాడు. దీంతో రషీద్ ఖాన్, ఏబీ డివిలియర్స్, విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా సెమీఫైనల్స్‌కు అర్హత సాధించారు. సెమీఫైనల్‌లో ఏబీ డివిలియర్స్‌తో జరిగిన పోటీలో రషీద్ ఖాన్‌ను వెనక్కి నెట్టి మిస్టర్ 360 (డివిలియర్స్) ఫైనల్‌కు చేరాడు. మరో సెమీఫైనల్‌లో కోహ్లీ, బుమ్రా తలపడగా.. రషీద్ భారత పేసర్‌నే ఎంపిక చేశాడు. దీంతో కోహ్లీకి ఫైనల్ చేరే అవకాశం లేకుండా పోయింది. గ్రాండ్ ఫైనల్‌లో డివిలియర్స్, బుమ్రా పోటీపడ్డారు. ఈ ఇద్దరిలో బుమ్రాను టీ20 క్రికెట్ గోట్‌గా ఎంపిక చేశాడు. దీంతో ఈ ఛాలెంజ్‌లో భారత పేసర్ విజేతగా నిలిచాడు. సాధారణంగా టీ20 ఫార్మాట్‌లో బ్యాటర్ల విధ్వంసకర ఇన్నింగ్స్‌లు, భారీ పరుగులు ఎక్కువగా చర్చకు వస్తుంటాయి. అయితే ఈ ఎంపికలో బుమ్రా బౌలింగ్ నైపుణ్యం, ఒత్తిడిలో రాణించే సామర్థ్యానికి రషీద్ ప్రాధాన్యమిచ్చాడు.

**రషీద్ ఖాన్ ఎంపిక చేసిన విజేతలు:**

క్వార్టర్ ఫైనల్స్: రషీద్ ఖాన్, ఏబీ డివిలియర్స్, విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా

సెమీఫైనల్స్: ఏబీ డివిలియర్స్, జస్ప్రీత్ బుమ్రా

గ్రాండ్ ఫైనల్: జస్ప్రీత్ బుమ్రా.

# బెస్ట్ ఇన్నింగ్స్ గిఫ్ట్‌గా ఇస్తా..



ఇండోర్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో ఒక ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. ఈ మ్యాచ్‌లో టీమిండియా 14 పరుగుల తేడాతో విజయం సాధించి, సిరీస్‌లో 2-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అంతకుముందు జరిగిన తొలి టీ20లో సెంచరీ సాధించి, రెండో టీ20లో 40 పరుగుల కీలక ఇన్నింగ్స్ ఆడిన శ్రేయస్ అయ్యర్‌పై అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్నారు. అయితే ఈ మ్యాచ్‌లో అయ్యర్ రొస్టన్ చేజ్ బౌలింగ్‌లో కేవలం 1 పరుగు మాత్రమే చేసి ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. శ్రేయస్ అయ్యర్ త్వరగా ఔట్ కావడంతో స్టాండ్స్‌లో ఉన్న ఒక లేడీ ఫ్యాన్ నిరాశకు గురై బోరున ఏడ్చేసింది. ఆమె కంటతడి పెట్టుకున్న దృశ్యాలను కెమెరాలు రికార్డ్ చేయడంతో ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. లెజెండరీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ సైతం సదరు అభిమాని చూపించిన స్వచ్ఛమైన ప్రేమను అభినందించారు. మ్యాచ్ ముగిసిన అనంతరం ప్రెజెంటర్ ఇయాన్ బిషప్ ఈ విషయాన్ని శ్రేయస్ అయ్యర్ దృష్టికి తీసుకెళ్లాడు. దీనిపై అయ్యర్ స్పందిస్తూ క్షమాపణలు చెప్పాడు. "నేను ఎప్పుడూ జట్టు కోసం నా అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికే ప్రయత్నిస్తాను. కానీ దురదృష్టవశాత్తూ ఈరోజు త్వరగా ఔటయ్యాను. నా ఆట చూడటానికి వచ్చిన ఆ వీరాభిమానిని నిరాశపరిచినందుకు క్షమాపణలు కోరుతున్నాను. కచ్చితంగా తర్వాతి మ్యాచ్‌లో బెస్ట్ ఇన్నింగ్స్ ఆడి, ఆమె ముఖంలో మళ్లీ చిరునవ్వు తీసుకురావడానికి నా వంతు ప్రయత్నం చేస్తాను" అని మాటిచ్చాడు. అయ్యర్ మాటలు విన్న సదరు అభిమాని స్టాండ్స్‌లోనే ఎగిరి గంతేసింది. శ్రేయస్ అయ్యర్ స్పందించిన తీరు, తన అభిమానుల పట్ల చూపిన గౌరవం నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంది. మైదానంలో ఆటగాళ్ల ప్రదర్శన అభిమానులపై ఎంతటి భావోద్వేగ ప్రభావం చూపుతుందో, అలాగే ఫ్యాన్స్ ప్రేమను క్రికెటర్లు ఎంతగా గౌరవిస్తారో ఈ సంఘటన నిరూపించింది.

# నువ్వు సిక్స్ కొడతావా.? నేను వికెట్ తీస్తా..




టీ20 క్రికెట్‌లో బౌలర్‌పై సిక్స్ కొట్టడం అంటే బ్యాటర్ ఆధిపత్యానికి సంకేతం.. కానీ, టీమిండియా సంచలనం నమన్ ధీర్ బౌలింగ్‌లో మాత్రం సీన్ రివర్స్ అవుతోంది. అతడి బౌలింగ్‌లో సిక్స్ కొట్టిన బ్యాటర్లను మరుసటి బంతికే పెవిలియన్‌కు పంపుతున్నాడు. అవును మీరు చదివింది నిజమే.. కావాలంటే ఒకసారి అతడి వికెట్లను పరిశీలంచండి..టీమిండియా ఆల్‌రౌండర్ నమన్ ధీర్ తన తొలి టీ20 అంతర్జాతీయ సిరీస్‌లోనే ప్రత్యేకమైన బౌలింగ్ ప్యాటర్న్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. తనపై సిక్స్ కొట్టిన బ్యాటర్‌ను.. ఆ వెంటనే వచ్చే బంతికే పెవిలియన్‌కు పంపుతున్నాడు. ఇప్పటివరకు ఆడిన మూడు టీ20ల్లో నమన్ ధీర్ తీసిన ఐదు వికెట్లకూ ఇదే ప్యాటర్న్ ఉంది. వెస్టిండీస్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లోనే నమన్ ధీర్ అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. లక్నోలో జరిగిన తొలి టీ20లో మూడు వికెట్లు తీసిన అతడు.. రాంచీలో జరిగిన రెండో మ్యాచ్‌లో వికెట్ తీయలేకపోయాడు. ఇక నిన్న ఇండోర్‌లో జరిగిన మూడో టీ20లో మరో రెండు వికెట్లు పడగొట్టి తన సత్తా చాటాడు. దీంతో మూడు టీ20ల్లోనే అతడి ఖాతాలో 5 వికెట్లు చేరాయి. అయితే ఈ ఐదు వికెట్లలోనూ ఒక ఆసక్తికరమైన పోలిక కనిపిస్తోంది. నమన్ ధీర్ బౌలింగ్‌లో సిక్స్ కొట్టిన బ్యాటర్లనే.. ఆ తర్వాతి బంతికే అతడు ఔట్ చేశాడు. వెస్టిండీస్‌తో లక్నోలో జరిగిన తొలి టీ20లో షై హోప్ 12వ ఓవర్ మూడో బంతికి నమన్ ధీర్‌పై సిక్స్ కొట్టాడు. అయితే వెంటనే నాలుగో బంతికే హోప్‌ను నమన్ ధీర్ పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత 14వ ఓవర్ తొలి బంతికి రొమారియో షెఫర్డ్ సిక్స్ బాదాడు. వెంటనే రెండో బంతికే అతడిని కూడా నమన్ ధీర్ ఔట్ చేశాడు. ఇక 16వ ఓవర్ నాలుగో బంతికి షమార్ స్ప్రింగర్ సిక్స్ కొట్టగా.. ఐదో బంతికే నమన్ ధీర్ అతడిని బోల్తా కొట్టించాడు. అలాగే మూడో టీ20లోనూ నమన్ ధీర్ తన ప్యాటర్న్‌ను కొనసాగించాడు. వెస్టిండీస్ ఇన్నింగ్స్ ఏడో ఓవర్ ఐదో బంతికి షిమ్రాన్ హెట్‌మయర్ సిక్స్ బాదాడు. అయితే తర్వాతి బంతికే నమన్ ధీర్ అతడిని ఔట్ చేశాడు. అదే విధంగా 11వ ఓవర్ ఐదో బంతికి పూరన్ సిక్స్ కొట్టాడు. వెంటనే తర్వాతి బంతికే నమన్ ధీర్ పూరన్ వికెట్ తీసుకున్నాడు. మూడు టీ20ల్లోనే ఐదు వికెట్లు తీసిన నమన్ ధీర్.. ఇదే ప్యాటర్న్‌ను కొనసాగిస్తే ఇకపై అతడి బౌలింగ్‌లో సిక్స్ కొట్టే ముందు బ్యాటర్లు ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిందే..



# బంతి బౌండరీ అనుకున్నాడు..

భారత్, వెస్టిండీస్ మధ్య జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో భారత యువ బ్యాటర్ తిలక్ వర్మ అనూహ్య రీతిలో రనౌట్ అయ్యాడు. బంతి బౌండరీకి వెళ్లిపోయిందని భావించి పరుగెత్తడం ఆపేయడంతో వికెట్ కోల్పోయాడు. మైదానంలో అతడు వ్యవహరించిన తీరు క్రికెట్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆదివారం ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో భారత్, వెస్టిండీస్ మధ్య మూడో టీ20 మ్యాచ్ జరిగింది. భారత ఇన్నింగ్స్ 17వ ఓవర్‌లో వెస్టిండీస్ బౌలర్ గుడాకేశ్ మోటి బౌలింగ్‌లో అక్షర్ పటేల్ బంతిని లెగ్ సైడ్ దిశగా ఆడాడు. బంతి బౌండరీ దాటిందని భావించిన అక్షర్ పటేల్, తిలక్ వర్మ ఒక పరుగు పూర్తి చేసిన తర్వాత మైదానం మధ్యలోనే ఆగిపోయారు. ఇద్దరూ బౌండరీ వెళ్లినట్లుగా భావించి పరస్పరం అభినందించుకున్నారు. అయితే, వెస్టిండీస్ ఫీల్డర్ కమిల్ పూరన్ వేగంగా కదిలి బంతిని బౌండరీకి చేరకుండా అడ్డుకున్నాడు. కీపర్‌కు బంతిని అందించాడు. అక్షర్ పటేల్ ప్రమాదాన్ని గుర్తించి సకాలంలో తన క్రీజులోకి చేరుకున్నాడు. దీంతో హోప్ బంతిని బౌలర్‌కు అందించాడు. బంతిని అందుకున్న గుడాకేశ్ మోటి బౌలర్ ఎండ్‌లోని వికెట్లను పడగొట్టాడు. అప్పటికీ తిలక్ వర్మ క్రీజుకు బయటే ఉన్నాడు. థర్డ్ అంపైర్ సమీక్షించి అతడిని రనౌట్‌గా ప్రకటించాడు. దీంతో తిలక్ వర్మ షాకయ్యాడు.

# బిజినెస్



# గోల్డ్ రేట్స్.. మళ్లీ తగ్గాయిగా

భారత్‌లో బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ అనిశ్చితుల నేపథ్యంలో ధరల్లో ఎగుడుదిగుడులు కనిపిస్తున్నాయి. గత వారం చివర్లో రూ.1800 మేర పెరిగిన మేలిమి పసిడి ధర నేడు రూ.440 మేర తగ్గింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేటి (అక్టోబర్ 12) ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల పుత్తడి ధర రూ.440 మేర తగ్గి రూ.1,50,980కు దిగొచ్చింది. 22 క్యారెట్ల పసిడి ధర కూడా రూ.400 మేర కోత పడి రూ.1,38,400కు పడిపోయింది. నగరంలో వెండి ధర మాత్రం స్థిరంగానే కొనసాగుతోంది. ప్రస్తుతం కిలో వెండి రూ.2.45 లక్షలుగా ఉంది.



# 2 రోజులు.. రూ.24,000 కోట్ల విక్రయాలు

పండగ సీజన్ నేపథ్యంలో ఈ-కామర్స్ సంస్థల విక్రయాలు ఊపందుకున్నాయి. పండగ సేల్ ప్రారంభమైన రెండు రోజుల్లోనే అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో, అజియో తదితర ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా సుమారు రూ. 24,000 కోట్ల విలువైన ఉత్పత్తుల అమ్మకాలు జరిగినట్లు కన్సల్టెన్సీ సంస్థ రెడ్‌సీర్ అంచనా వేసింది. ఈ రెండు రోజుల్లో సాధారణ రోజువారీ వ్యాపారం కంటే ఆర్డర్ల సంఖ్య ఆరు రెట్లు పెరిగిందని తెలిపింది. సుమారు 6 నుంచి 6.5 కోట్ల వినియోగదారులు దాదాపు 8-9 కోట్ల ఆర్డర్లు చేసినట్లు వెల్లడించింది. మొత్తం అమ్మకాల్లో స్మార్ట్‌ఫోన్ల వాటా 30-40 శాతం (రూ.9,100-9,600 కోట్లు), కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, టీవీలు, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు వంటి గృహోపకరణాల వాటా 25-27 శాతం (రూ.6,000-6,500 కోట్లు), ఫ్యాషన్ ఉత్పత్తుల వాటా 15-18 శాతం (రూ.3,630-4,350 కోట్లు) ఉన్నట్లు రెడ్‌సీర్ అంచనా వేసింది.

# నేషనల్ స్టీల్ పాలసీ డ్రాఫ్ట్..




దేశీయ ముడి ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని 2047 నాటికి 60.4 కోట్ల టన్నులకు పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నేషనల్ స్టీల్ పాలసీ 2047 ముసాయిదాను ఆదివారం విడుదల చేసింది. ఈ నూతన విధానం ఉక్కు రంగంలో పోటీతత్వాన్ని పెంచడంతో పాటు దిగుమతుల సవాళ్లను పరిష్కరించనుంది. దీని ప్రకారం.. 2047 నాటికి ఫినిష్డ్ స్టీల్ డిమాండ్ 505 మిలియన్ టన్నులకు, తలసరి వినియోగం 302 కిలోలకు, ఎగుమతులు 45 మిలియన్ టన్నులకు చేరుకోవచ్చు. ఉక్కు తయారీ వ్యయంలో ముడిసరుకు వాటా 65 నుంచి 70 శాతం వరకు ఉంటుంది. ఇనుప ఖనిజంలో భారత్ స్వయంసమృద్ధి సాధించినప్పటికీ, కోకింగ్ కోల్ అవసరాల్లో 92 శాతం వరకు దిగుమతులపైనే ఆధారపడుతోంది. వీటిని తగ్గించేందుకు గనుల తవ్వకం, ఏఐ టెక్నాలజీలను ప్రోత్సహించనున్నారు. దేశంలో ముడి ఉక్కు ఉత్పత్తిలో 47 శాతం వాటా కలిగిన 2,550 సెకండరీ స్టీల్ యూనిట్లకు ముడిసరుకు, నైపుణ్యాభివృద్ధిలో మద్దతు ఇస్తారు. ఉక్కు రంగం నుంచి వచ్చే కార్బన్ ఉద్గారాలను తగ్గించి, 2070 నాటికి నెట్ జీరో సాధించడం ఈ పాలసీ ప్రధాన లక్ష్యం. స్క్రాప్ వినియోగం పెంచడం, హైడ్రోజన్, పునరుత్పాదక విద్యుత్ వాడకం ద్వారా ఈ లక్ష్యాన్ని చేరుకుంటారు. నాణ్యత లేని ఉక్కు దిగుమతులను నిరోధించేందుకు ఏఐ టెక్నాలజీలను వాడుతారు. మనదేశంలో ముడి ఉక్కు ఉత్పత్తి 2015లో 89 మిలియన్ టన్నుల నుంచి 2026 నాటికి 170 మిలియన్ టన్నులకు పెరిగిందని ఈ డ్రాఫ్ట్ పేర్కొంది.



# రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు

ఈ నెల ఒకటో తేదీన ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను భారీగా పెంచిన విషయం తెలిసిందే. ఈ పెంపుతో హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర వ్యాపార సంస్థలపై ఆర్థిక భారం మరింత పెరగనుంది.
అక్టోబర్ 1వ తేదీన 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌పై ఒక్కసారిగా రూ.62.50 పెంచాయి.
ఈ పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో కమర్షియల్ సిలిండర్ ధర రూ.2,837.50కి చేరుకుంది. దీంతో తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో హైదరాబాద్‌లో రూ.3,065కి, విజయవాడలో 2,932.50, విశాఖపట్నంలో రూ.2,827.50కి ధరలు చేరాయి. ఇదిలా ఉంటే.. గృహ వినియోగ ఎల్‌పీజీ ధరలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. ఈ రోజు(సోమవారం, అక్టోబర్ 12) రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.
తెలంగాణలోని హైదరాబాద్ నగరంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.994.00గా, వరంగల్‌లో రూ.1013.00గా ఉంది. ఇక, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరాలైన విశాఖపట్నంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.950.00గా, విజయవాడలో రూ.966.50, గుంటూరులో రూ.966.50గా ఉంది.




# సెకండ్ సింగిల్ అప్డేట్

మ్యాచో స్టార్ గోపీచంద్, టాలెంటెడ్ డైరెక్టర్ సంకల్ప్ రెడ్డి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మూవీ 'భరతవర్ష: సాగర్ ఆఫ్ షులే'. గోపీచంద్ కెరీర్‌లో 33వ ప్రాజెక్ట్‌గా వస్తున్న ఈ చిత్రంలో రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత శ్రీనివాసా చిట్టూరి ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన 'వీర జయధీర' సాంగ్ ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తిని పెంచగా.. తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి సెకండ్ సాంగ్ అప్‌డేట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. 'ఈ నవరాత్రికి, ఒక శక్తివంతమైన ఆగమనం పండుగ వాతావరణాన్ని సరికొత్తగా ఆవిష్కరించనుంది' అంటూ ఒక క్రేజీ క్యాప్షన్‌తో కూడిన పోస్టర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ సినిమాలోని సెకండ్ సింగిల్ అయిన 'అమ్మకదిలివచ్చే' లిరికల్ వీడియోను అక్టోబర్ 14న మధ్యాహ్నం 3:52 గంటలకు విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ నవరాత్రి పండుగ వేళ ప్రేక్షకులకు అదిరిపోయే ట్రీట్ ఇవ్వడానికి మేకర్స్ సిద్ధమయ్యారు. ఇక ఈ అప్‌డేట్‌తో పాటు విడుదల చేసిన పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచేసింది. గుట్టలు, కొండల మధ్యలో నుంచి గోపీచంద్, రీతూ వర్మతో పాటు ఒక చిన్నారి విగ్రహాన్ని ఎత్తుకుని వస్తున్నట్లుగా ఉన్న ఈ పోస్టర్ చాలా పవర్‌ఫుల్‌గా కనిపిస్తోంది. సంకల్ప్ రెడ్డి మార్క్ మేకింగ్, గోపీచంద్ మాస్ లుక్, దేవుడి నేపథ్యంలో సాగే ఈ సాంగ్ సినిమాపై అంచనాలను పెంచడం ఖాయంగా కనిపిస్తోంది.

# సక్సెస్ దక్కేనా?



మెగా హీరో వైష్ణవ్ తేజ్ 'ఉప్పెన'తో ఇండస్ట్రీకి వచ్చి తొలి ప్రయత్నంలో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ఇక ఆ తర్వాత చేసిన చిత్రాలు పెద్దగా రాణించలేకపోయాయి. వరుస పరాజయాలతో గత మూడేళ్లుగా టాలీవుడ్‌కు దూరంగా ఉంటున్నారు. అయితే ఇప్పుడు గ్యాప్ ఇచ్చినా సరే, అదిరిపోయే కంబ్యాక్ ఇవ్వడానికి ఆయన పక్కా ప్లాన్ చేసుకున్నట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. ఒకేసారి మూడు క్రేజీ ప్రాజెక్ట్‌లను లైన్‌లో పెట్టి బాక్సాఫీస్ వద్ద గట్టిగా కొట్టేందుకు సిద్ధవ-ువుతున్నారట. తాజా సమాచారం ప్రకారం, వైష్ణవ్ తేజ్ కొత్త సినిమాకు రంగం సిద్ధమైనట్లు టాక్. నూతన దర్శకుడు మహేష్ దర్శకత్వంలో ఆయన ఒక ప్రాజెక్ట్ చేయనున్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. ప్రముఖ నిర్మాత అనిల్ సుంకర చెందిన 'ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్' బ్యానర్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్నారట. ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే ఇండస్ట్రీలో మంచి అంచనాలు నెలకొన్నాయి. కేవలం ఈ ఒక్క చిత్రమే కాకుండా, వైష్ణవ్ తేజ్ మరికొద్ది మంది టాప్ డైరెక్టర్లతో కూడా చర్చలు జరుపుతున్నారు. టాలెంటెడ్ డైరెక్టర్ వి.ఐ. ఆనంద్ తో పాటు, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ పరశు రామ్ లతో కూడా ఆయన సినిమాలు చేయ-ుబోతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పరశురామ్ దర్శకత్వంలో రాబోయే ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాత దిల్ రాజుకు చెందిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నట్లు సమాచారం. చాలా కాలం తర్వాత మెగా ప్రిన్స్ నుంచి వస్తున్న ఈ లైనప్ చూస్తుంటే.. ఈసారి బాక్సాఫీస్ వద్ద ఆయన రచ్చ గట్టిగానే ఉండబోతుందని అభిమానులు భావిస్తున్నారు. ఇక ఈసారి అయినా సక్సెస్ దక్కుతుందా? లేక మొత్తానికే ఇండస్ట్రీకి దూరం అవుతాడా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# 'జై హనుమాన్'లో మలయాళ క్రష్ ?



'హను-మాన్' సృష్టించిన ప్రభంజనం తర్వాత దర్శకుడు ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి రాబోతున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ 'జై హనుమాన్'. 'కాంతార' ఫేమ్ రిషబ్ శెట్టి ఈ చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తుండటంతో సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ పాన్-ఇండియా విజువల్ వండర్‌లో కనిపించబోయే హీరోయిన్ ఎవరనే అంశంపై గత కొద్దిరోజులుగా రకరకాల పేర్లు వినిపించాయి. తాజాగా ఈ సస్పెన్స్‌కు ఎండ్ కార్డ్ పడినట్లు ఇండస్ట్రీ వర్గాలతో పాటు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతుంది. యూత్ ఆడియన్స్‌లో సెన్సేషనల్ క్రేజ్ సంపాదించుకున్న మలయాళ క్రష్ మమితా బైజు 'జై హనుమాన్'లో ఫిమేల్ లీడ్‌గా ఎంపికైనట్లు తెలుస్తుంది. 'ప్రేమలు' చిత్రంతో కుర్రకారు కలల రాణిగా మారిన ఈ బ్యూటీని, ఒక మైథలాజికల్ యాక్షన్ డ్రామాలో రిషబ్ శెట్టి లాంటి స్టార్ పక్కన రంగంలోకి దించడం ఇప్పుడు సినీ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. డివైన్ అండ్ పవర్‌ఫుల్ సబ్జెక్ట్‌లో మమితా పాత్ర ఎంతటి ప్రత్యేకతను సంతరించుకోనుందో అన్నది ఆసక్తి రేపుతోంది. సాధారణంగా ఇలాంటి పాన్-ఇండియా సినిమాల్లో నటీనటులను భారీ పోస్టర్లు, అనౌ-న్స్‌మెంట్లతో అధికారికంగా పరిచయం చేస్తుంటారు. కానీ ప్రశాంత్ వర్మ మార్క్ సర్‌ప్రైజ్ ఇక్కడే కనిపించింది. ఎలాంటి అధికారిక హడావుడి లేకుండానే మమితా బైజు కొద్ది రోజుల క్రితమే గుట్టుచప్పుడు కాకుండా చిత్ర షూటింగ్‌లో అడుగుపెట్టేసినట్లు ప్రచారం జరుగుతుంది. ప్రస్తుతం జరుగుతున్న కీలక షెడ్యూల్‌లో ఆమె రిషబ్ శెట్టితో కలిసి పాల్గొంటున్నట్లు సమాచారం. అయితే దీనిపై మేకర్స్ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రాలేదు.

# హోటల్‌లో వెయిటర్‌గా పనిచేశా



అప్పట్లో నేరుగా శివాజీ గణేశన్ గారి ఇంటికెళ్లి అవకాశం అడగాలని ప్రయత్నించినా, ఆయనను కలవడం కుదరకపోవడంతో మళ్లీ ఇంటికి తిరిగొచ్చినట్లు తెలిపారు. ఆ తర్వాత తాను చెన్నై వెళ్లిన విషయం తెలిసి అమ్మానాన్న చాలా కోప్పడ్డారని గుర్తుచేసుకున్నారు. ఇంటర్ తర్వాత మదురైలోని ఇంజనీరింగ్ కాలేజీలో సీటు వచ్చినా తాను ఆ మాట వినలేదని, చెన్నైలోనే డిగ్రీ చేస్తానని పట్టుబట్టానని సూర్య తెలిపారు. తన పట్టుదలను చూసి అయిష్టంగానే అమ్మానాన్న ఒప్పుకున్నా, సినిమాల జోలికి మాత్రం వెళ్లొద్దని కండీషన్ పెట్టారని చెప్పారు. చెన్నైలో చదువుకుంటూనే అవకాశాల కోసం స్టూడియోల చుట్టూ తిరిగేవాడినని, ఆ సమయంలో ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డానని అన్నారు. కడుపు నింపుకోవడం, ఆకలి తీర్చుకోవడం కోసం ఒక హోటల్‌లో వెయిటర్‌గా కూడా పనిచేశానని ఎస్.జే. సూర్య చెప్పుకొచ్చారు.

# 'జైలర్ 2' ప్రీరిలీజ్ హంగామా..




సూపర్‌స్టార్ రజనీకాంత్ - నెల్సన్ దిలీప్‌కుమార్ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ యాక్షన్ థ్రిల్లర్ 'జైలర్ 2' ప్రమోషన్స్ తెలుగు నాట ఊపందుకున్నాయి. ఫస్ట్ పార్ట్‌కి తెలుగు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టడంతో, ఈ సీక్వెల్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అయితే అందరినీ ఆశ్చర్యపరుస్తూ.. సొంత ఇండస్ట్రీ అయిన కోలీవుడ్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను చిత్ర యూనిట్ పూర్తిగా స్కిప్ చేసింది. కానీ తెలుగు మార్కెట్ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ వేదికగా గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ను లాక్ చేశారు. అక్టోబర్ 12న సాయంత్రం 5 గంటల నుంచి శిల్ప కళావేదికలో ఈ ఈవెంట్ జరగనున్నట్లు వెల్లడించారు. అయితే ఈ గ్రాండ్ ఈవెంట్‌కు సూపర్ స్టార్ రజనీకాంత్ స్వయంగా హాజరవుతారా అని ఫ్యాన్స్ ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఈ వేదికపై అందరి దృష్టి తెలుగు డిస్ట్రిబ్యూటర్, ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగవంశీ పైనే ఉండనుంది. సినిమాల టికెట్ రేట్ల పెంపు వ్యవహారంపై నాగవంశీ ఏం మాట్లాడుతారు, లేకపోతే ఈ అంశాన్ని ఆయన పూర్తిగా దాటవేస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది.

# చరణ్ పక్కన ఆ హీరోయిన్..

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఫ్యాన్స్‌కు దసరా పండుగ వేళ డబుల్ ధమాకా లాంటి అప్‌డేట్ వచ్చేసింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ 'RC17' గ్రాండ్ లాంచ్‌కు ముహూర్తం దాదాపు ఫిక్స్ అయిపోనట్లు కనిపిస్తుంది. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 20న చిత్ర బృందం పూజా కార్యక్రమాలను ఈ చిత్రాన్ని ఘనంగా ప్రారంభించేందుకు ప్లాన్ చేస-్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. అయితే ఈ పూజా కార్యక్రమాల కంటే ఎక్కువగా ఇప్పుడు ఇండస్ట్రీని షేక్ చేస్తున్న పాయింట్ ఒక్కటే.. 'చరణ్ పక్కన హీరోయిన్ ఎవరు?' అన్నది. ఈ రేసులో వినిపిస్తున్న పేరు వింటే ఎవరైనా షాక్ కావాల్సిందే. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో రామ్ చరణ్ సరసన హీరోయిన్‌గా సారా అర్జున్ పేరు గట్టిగా వినిపిస్తుండటం ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. 'నాన్న' సినిమాతో పాటు ఎన్నో చిత్రాల్లో అద్భుతమైన నటనతో అలరించిన ఈ చైల్డ్ ఆర్టిస్ట్, రీసెంట్‌గా ధురంధర్ సినిమాలో హీరోయిన్‌గా మెప్పించి అందరి ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు గ్లోబల్ రేంజ్ మాస్ ఇమేజ్ ఉన్న రామ్ చరణ్ పక్కన ఏకంగా సారా అర్జున్‌ను హీరోయిన్‌గా దించుతున్నారన్న ప్రచారం సినీ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. ఈ కాంబినేషన్ నిజమేనా? లేక సోషల్ మీడియాలో పుట్టుకొచ్చిన రూమరా? అన్నదానిపై క్లారిటీ రావాలంటే మేకర్స్ అఫీషియల్ అనౌన్స్‌మెంట్ చేసే వరకు ఆగాల్సిందే. ఒకవేళ ఇదే నిజమైతే ఈ విభిన్నమైన జోడీ వెనుక దర్శకుడు ఎలాంటి ఊహించని ట్విస్ట్ ప్లాన్ చేసి ఉంటాడన్నది ఆసక్తికరంగా మారింది.



# రచ్చలేపుతున్న 'క్రేజీ కల్యాణం'




టాలీవుడ్‌లో ప్రస్తుతం అవుట్ అండ్ అవుట్ విలేజ్ ఫ్యామిలీ కామెడీ ఎంటర్‌టైనర్ల జోరు కొనసాగుతోంది. ఈ కోవలోకే చెందిన లేటెస్ట్ మూవీ 'క్రేజీ కల్యాణం'. తరుణ్ భాస్కర్, అనుపమ పరమేశ్వరన్, అఖిల్ రాజ్ ముఖ్య పాత్రల్లో బద్రప్ప గాజుల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్ర ట్రైలర్ తాజాగా విడుదలై సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆద్యంతం తెలంగాణ గ్రామీణ నేపథ్యం, బంధుత్వాల గొడవలు, నవ్వులు పూయించే డైలాగ్స్‌తో ట్రైలర్ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటోంది. ఈ ట్రైలర్‌లో అన్నిటికంటే ఎక్కువగా ఆడియన్స్‌ను ఆకర్షించిన అంశం ఇందులోని బోల్డ్ అండ్ రా డైలాగ్స్. పెళ్లి చుట్టూ తిరిగే గందరగోళం, "నాకు ఈ పెళ్లి ఇష్టం లేదు.. నేనొకరిని ప్రేమిస్తున్నా" అంటూ హీరోయిన్ చెప్పే ట్విస్ట్.. ఆ వెంటనే "ఇవన్నీ ఓకే.. మీరిద్దరూ ఎప్పుడైనా ఫిజికల్ అయ్యారా?" అంటూ పెళ్లి కొడుకు పాత్ర అడిగే ఒక్క ప్రశ్నతో ట్రైలర్ ఒక్కసారిగా పీక్స్‌కు చేరింది. కుటుంబ బంధాల నడుమ ఇలాంటి నేటి తరం బోల్డ్ ప్రశ్నలను సరదాగా చొప్పించిన విధానం యూత్‌ను ఆకర్షిస్తోంది. ట్రైలర్ స్టార్టింగ్ మందు తాగి పొద్దున్నే బొట్లు పెట్టుకుని పూజలు చేసే పెద్దల్లుడు 'బాలరాజు' వ్యవహారంతో మొదలైంది. "చిన్నదానికి మంచి సంబంధం తెచ్చి ఊళ్లో నా పోయిన పరువు తెచ్చుకుంటా" అనే డైలాగులు గ్రామీణ జీవన శైలిని సహజంగా ఆవిష్కరించాయి. అక్టోబర్ 16న థియేటర్లలోకి రాబోతున్న ఈ సినిమా ట్రైలర్ చూస్తుంటే థియేటర్లలో నవ్వుల విందు గ్యారెంటీ అనిపిస్తోంది. తరుణ్ భాస్కర్ నేచు-రల్ యాక్టింగ్, తోడుగా గ్రామీణ యాసలో సాగే సంభాషణలు సినిమాపై బజ్‌ను పెంచేశాయి. మొత్తానికి బోల్డ్ కామెడీతో వచ్చిన 'క్రేజీ కల్యాణం' ట్రైలర్ యూట్యూబ్‌లో మంచి వ్యూస్‌తో దూసుకుపోతోంది.

# శ్రీరాముని యుగారంభం..



బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు నితీష్ తివారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న భారీ పౌరాణిక చిత్రం 'రామాయణ'. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన ప్రతి అప్డేట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకోగా.. సినిమా విడుదల కోసం ఎంతో ఈగర్‌గా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే నవరాత్రుల శుభ సందర్భంగా ఈ సినిమా విడుదలపై బిగ్గెస్ట్ అప్డేట్ ఇస్తూ సరికొత్త పోస్టర్‌ను పంచుకున్నారు మేకర్స్. 'నవరాత్రి శుభ సందర్భంలో, మనం ఒక నూతన యుగ ఆవిర్భావానికి వేదికవుతున్నాం. ఇది శ్రీరాముని యుగారంభం.. నమిత్ మల్హోత్రా వారి 'రామాయణ - పార్ట్ 1': నవంబర్ 5 నుండి ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రీమియం ఫార్మాట్లలో థియేటర్లలో విడుదల కానుంది.. దసరా నాడు అడ్వాన్స్ బుకింగ్‌లు ప్రారంభమవుతాయి' అని ప్రకటించారు. అలాగే విడుదల చేసిన పోస్టర్‌లో రావణుడిగా యశ్ భీకర రూపంలో కనిపిస్తుండగా.. రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి లుక్ ప్రేక్షకులను ఆటకట్టుకుంటుంది. కాగా.. ఇందులో కాజల్ అగర్వాల్ మండోదరిగా, రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణక పాత్రలో కనిపించబోతున్నారు.
రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ భారీ మైథలాజికల్ డ్రామా రెండో భాగాన్ని వచ్చే ఏడాది దీపావళికి థియేటర్లలోకి తీసుకురానున్నారు.

Edited, Printed, Published & Owned by KOMARAJU SRINIVASULU and Printed at Ramu Graphics, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229